




నర్సింగ్.. నై

- విద్యార్థులతో నెట్టుకొస్తున్నారు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత
- వైద్య పరికరాల లేమి.. సిబ్బందీ అరకొరే
- ఓపీలకు అనుగుణంగా పెరిగిన వసతులు
- సకాలంలో చికిత్సలు అందక ప్రాణాలు హరీ



వైద్య చికిత్సలో నర్సుల పాత్ర ఎంతో కీలకం. చికిత్సలకు ముందు రోగులు, బాధితులకు సేవలు అందించేది నర్సులు. ఇంజక్షన్ల నుంచి గాయాలకు కట్లు కట్టడంతో పాటు శస్త్రచికిత్సల్లో వైద్యులకు సహాయకారిగా ఉండేది నర్సులే. ఇలాంటి నర్సులు కొరత ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొంది. వివిధ విభాగాల్లో ఇతర సిబ్బంది.. పరికరాలు.. అన్నీ ఉన్నా నర్సులు లేకపోవడంతో రోగులకు సరైన చికిత్సలు సక్రమంగా అందడంలేదు. ప్రధానంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఏరియా ఆస్పత్రుల్లో కూడా నర్సుల కొరత వెంటాడుతోంది. ఆయా ఆస్పత్రుల్లో నర్సింగ్ చదివే విద్యార్థులతో సరిపెడుతున్నారే కాని నర్సింగ్ సిబ్బంది నియామకంపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. పగలు నర్సింగ్ విద్యార్థులు ఉన్నా రాత్రి వేళల్లో నర్సులు కొరతతో రోగులు ఇక్కట్లు పడుతున్నారు. నర్సుల పోస్టులు భర్తీ చేయాలని లేఖలు రాస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ స్పందించడంలేదన్న విమర్శలున్నాయి. ఇక పెరుగుతున్న ఓపీలకు, రోగులకు అనుగుణంగా వసతులు, సాకర్యాల కల్పనలోనూ ప్రభుత్వం పట్టీపట్టనట్లుగా ఉంటుందన్న ఆరోపణలున్నాయి. కొన్ని ఆస్పత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు కూడా అన్ని విభాగాల్లో లేరని సమాచారం.

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో మూలకు చేరిన వెంటిలేటర్లు





నరసరావుపేట: ఆస్పత్రిలో రోగికి వైద్య సేవలు అందజేస్తున్న నర్సింగ్ విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

పేరుకు అవి పెద్దాస్పత్రులే. ఇక్కడ నర్సులు ఉండరు.. వైద్యులు ఉండరు.. పరికరాలు, సౌకర్యాలు, మందులూ అంతంతే. ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీని తట్టుకోలేక పేద, మధ్య తరగతి వర్గాలు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో గత కొంతకాలంగా ఓపీ రోగులు విపరీతంగా పెరిగిపోతున్నారు. అయితే రోగుల సంఖ్యకు అనుగుణంగా చాలా ఆస్పత్రుల్లో నర్సుల నియామకాలు జరగడం లేదు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లుగా ఏరియా వైద్యశాలల్లో సౌకర్యాల కల్పనపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. దీంతో ఇప్పుడు ఆస్పత్రుల్లో రోగులకు కష్టాలు రెట్టింపయ్యాయి. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందడం గగనంగా మారింది. రెండేళ్ల క్రితం వరకు ఏరియా ఆసుపత్రుల్లో 200 వరకు మాత్రమే ఉండే ఓపీల సంఖ్య ప్రస్తుతం అది 400 వరకు చేరుకుంది. కానీ అరకొరగా అవే వైద్య పరికరాలు, చాలీచాలని సిబ్బందితోనే ఇప్పుడు కూడా వైద్యం అందిస్తున్నారు. దీంతో ప్రాంతీయ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మిగులు తోంది. పల్నాడు, బాపట్ల జిల్లాలుగా ఆవిర్భవించి రెండున్నరేళ్లు దాటినా జిల్లా ఆస్పత్రుల ఏర్పాటు ఊసే మరిచారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడచినా ఏరియా ఆస్పత్రులలో వసతుల కల్పనతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఖాళీల భర్తీపై నిర్మాణాత్మక ప్రకటన ఇప్పటికీ విడుదలకాలేదు. ఆస్పత్రుల నిర్వహణపై పాలకులకు చిత్తశుద్ధి కొరవడిందన్న విమర్శలున్నాయి. మొక్కుబడిగా ప్రభుత్వాస్పత్రులను నిర్వహిస్తున్నట్లుగా ఇక్కడ నె లకొన్న పరిస్థితులు తెలియజేస్తు న్నాయి.

- తెనాలి: తెనాలిలో పేరుకు జిల్లా వైద్యశాల. 300 పడకలున్నాయి. కానీ సిబ్బందే లేరు. ప్రాథమిక చికిత్స అందించేందుకు అవసరమైన నర్సులు సగం కూడా లేరు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న సామెత తెనాలి వైద్యవిధాన పరిషత్ జిల్లా వైద్యశాలకు సరిగ్గా సరిపోతుంది. ఎప్పుడో 100 పడకలు ఉన్నప్పుడు ఉన్న 48 మంది నర్సింగ్ సిబ్బందే ఇప్పుడూ కొనసాగుతున్నారు. వీరంతా పెరిగిన 200 పడకల ఆసుపత్రితో పాటు, కొత్తగా వచ్చిన తల్లీపిల్లల వైద్యశాలలోనూ విధులు నిర్వర్తిస్తున్నారు. 20 బెడ్‌లతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ అందుబాటులోకి వచ్చినా సిబ్బంది లేరు. ఆస్పత్రి స్థాయిని పెంచడానికి, పడకలు భారీగా చూపించడానికి చూపుతున్న తాపత్రయం పెరిగిన రోగులకు తగ్గట్టుగా నర్సింగ్ సిబ్బందిని మంజూరు చేయించడంలో నేతలు శ్రద్ధ చూపడంలేదు. సిబ్బంది కొరతతోనే కనీసం రోగులను ప్రేమగా ఆదరించే పరిస్థితి కూడా కరువైంది. ప్రస్తుతం 320 బెడ్‌లకు కనీసం 100 మంది శ్టాఫ్ నర్సులు అవసరమైతే 48 మంది వరకే అలాట్‌మెంట్ ఉంది. అయితే దీనిలోనూ 38 మందే శ్టాఫ్ నర్సులు రెగ్యులర్ విధుల్లో ఉన్నారు. మరో ముగ్గురు కాంట్రాక్ట్ ప్రాతిపదికన, ఒకరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తుంటే, 48 మందలోనూ కేవలం 42 మంది మాత్రమే ఉన్నట్లు లెక్క. 200 పడకలు ఉన్న జిల్లా వైద్యశాలకే నిబంధనల ప్రకారం 60 మంది ఉండాల్సి ఉంటే, కేవలం 42 మందే ఉన్నారు. 12 ఏళ్ల క్రితం ప్రారంభించిన తల్లీపిల్లల వైద్యశాలకు కనీసం 30 స్టాఫ్ నర్స్‌లకు ఒక్క పోస్ట్ కూడా లేదు. జిల్లా వైద్యశాల సిబ్బందినే సర్దుబాటు చేస్తున్నారు. డాక్టర్ల దగ్గర నుంచి నర్సుల వరకు అంతా జిల్లా వైద్యశాల సిబ్బందికి అదనపు విధులు కేటాయించడంతోనే సరిపెడుతున్నారు. 100 పడకలతో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభమైతే మరింత మంది సిబ్బంది అవసరం ఉంటుంది. అప్పుడుకూడా కొత్తగా నియామకాలు లేకుండా ఈ 42 మందినే సర్దుబాటు చేస్తే మాత్రం రోగుల ప్రాణాలతో చలగాటం ఆడుకున్నట్టే. ఎ.ఎన్.ఎమ్‌లు, ఎఫ్. ఎన్.ఒలు, ఎం.ఎన్.ఒల పరిస్థితయితే మరీ దారుణం. వీరుకూడా సరిపడాలేక రోగుల కుటుంబ సభ్యులే స్ట్రెచర్‌లు మోయటం, చక్రాల కుర్చీని నెట్టుకు వెళ్లటం వంటివి ఇక్కడ పరిపాటిగా మారిపోయాయి.

- మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. అత్యవసర వైద్యం అందుబాటులో లేదు. ప్రస్తుతం 30 పడకలతో ఉన్న ఆస్పత్రిని వంద పడకల సమగ్ర ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అ యితే నర్సింగ్‌స్టాఫ్ నియామకం చేయాల్సివుంది.
- పొన్నూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర వైద్యానికి వినియోగించే వెంటిలేటర్ సౌకర్యాం లేక రోగులు అవస్థలు పడుతున్నారు. నిడుబ్రోలులో 30 పడకల ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సరిపడ అందుబాటులో ఉన్నా పేదలకు అత్యవసర వైద్యం అందడంలేదు. రోడ్డు ప్రమాదాలు, తీవ్ర అనారోగ్య బాధితులకు అత్యవసర వైద్యం అందాలంటే గుంటూరుకు వెళ్లాల్సి వస్తోంది.

మందుల సరఫరా అంతంతే

వైద్యశాలలకు మందుల సరఫరా అంతంతమాత్రంగానే ఉంది. రోజూ వందలాది మంది రోగులు చికిత్స కోసం వస్తున్నా ఆ స్థాయిలో మందులు సరఫరా లేదు. దీంతో ఆస్పత్రిలోని ప్రైవేట్ షాపుల్లో మందులను రోగులు కొనుగోలు చేస్తున్నారు. రోగుల సంఖ్య పెరగడంతో సరఫరా అవుతున్న మందుల నిల్వలు సరిపోవడంలేదని సిబ్బంది చెబుతున్నారు. మందుల ఇండెంట్‌ను పెంచాల్సి ఉంది. ప్రతి రోజు వైద్యం కోసం వచ్చే వారిని అంచనా వేసి అందుకు తగ్గట్టుగా మందుల సరఫరాను పెంచాలని రోగులు కోరుతున్నారు.



రిజిస్ట్రేషన్లకు గండం

- రైతుల ప్లాట్లకు సీఆర్డీఏ మోకాలడ్డు
- సమీకరణ భూముల్లో అసైన్డ్ ఉంటే అంతే సంగతి
- అధికారుల తీరుపై రాజధాని రైతుల ఆగ్రహం
- నాట్ ట్యాలీడ్ పేరుతో కౌలు ఎగవేతపైనా ఆవేదన

(గుంటూరు- ఆంధ్రజ్యోతి)

ఇలా ఒకరు, ఇద్దరు కాదు నీరుకొండ, కురగల్లు గ్రామాల్లోనే 600 మంది ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ను అధికారులు ఆపేశారు. ఇలా రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో వందలాది మంది రైతుల రిటర్నబుల్ ప్లాట్లను సీఆర్డీఏ అధికారులు రిజిస్ట్రేషన్ చేకుండా నిలిపివేశారు. 2015లో భూసమీకరణ పథకం కింద భూములిచ్చిన రైతులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏటా కౌలు చెల్లించడంతోపాటు రైతులకు గృహ సముదాయం, వాణిజ్య సముదాయం కింద రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించింది. 2019 ఎన్నికలకు ముందు వరకూ ఆ ప్రభుత్వం వారి ప్లాట్లను రిజిస్టర్ చేసింది. అయితే ఎన్నికల నాటికి ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను పూర్తిగా పక్కనపెట్టింది. గడిచిన ఐదేళ్ల రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. కిందటి ఎన్నికలకు ఏడాది ముందు వైసీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల పేర హడావుడి చేసినా రైతులు మాత్రం ముందుకు రాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతులు తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ముందుకు వస్తున్నారు. అయితే సీఆర్డీఏ అధికారులు

(మిగతా 6వ పేజీలో..)

- నీరుకొండకు చెందిన జొన్నలగడ్డ విష్ణువర్ధనరావు ఆరున్నర ఎకరాల పట్టాభూమి, 70 సెంట్లు ఫారెస్టు భూమిని ల్యాండ్ భూ సమీకరణ కింద ఇచ్చారు. అతడికి ఫుల్ ప్యాకేజీ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అతడి రిటర్నబుల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారు. రెండు నెలల నుంచి సీఆర్డీఏ కార్యాలయం చుట్టూ తిరిగి ఆయన విసిగి వేసారిపోయారు.

- కురగల్లుకు చెందిన మాదల సుజాత అనే మహిళా రైతు ఐదు ఎకరాలు పట్టాభూమి, అర ఎకరం ఫారెస్టు భూమిని భూ సమీకరణ కింద ఇచ్చారు. ఆమెకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి సీఆర్డీఏ అధికారులు ఆపుతున్నారు. ఆ రైతులు ఇచ్చిన పట్టా భూముల తాలూకు రిటర్నబుల్ ప్లాట్లను కూడా సీఆర్డీఏ అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం లేదు.

కమిషనర్ vs హెల్త్ ఆఫీసర్

- డంపింగ్ యార్డ్‌లో ఒకరిపై ఒకరు అరుపులు
- చేయి చేసుకున్నారని తెనాలిలో జోరుగా ప్రచారం
- మున్సిపాలిటీలో అధికారుల మధ్య ముదురుతున్న విభేదాలు

తెనాలి, మారీస్‌పేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):

- పారిశుధ్య పనుల విషయంపై అడిగితే తెలియదని ఎదురు చెబుతారేంటి?
- ఇంజనీరింగ్ సెక్షన్ చెప్పాల్సిన వివరాలు నన్నడిగితే నేనెట్లా చెబుతాను?
- నా పరిశీలన, నా సంతకం లేకుండా ఆయిల్ బిల్స్ పంపిస్తున్నారుకదా! రూల్స్ తెలిసి అలా ఎలా చేస్తారు?
- ఇలా మొదలైన వాదనలు చివరకు నువ్వెంతంటే నువ్వెంతనే వరకు మున్సిపల్ డంపింగ్‌యార్డు ఆవరణలో సిబ్బంది సమక్షంలో కమిషనర్ శేషన్న, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల మధ్య బుధవారం చోటుచేసుకున్నాయి. అయితే కమిషనర్ హెల్త్ ఆఫీసర్‌పై చేయి చేసుకున్నారంటూ పుకార్లు షికార్లు చేశాయి. ఇక్కడ బయటకు కనిపించింది వీరిద్దరే అయినా, మరో ఇద్దరు అధికారులు కూడా విభేదాల వివాదంలో ఉన్నట్లు చెబుతున్నారు.

బుధవారం డంపింగ్ యార్డు దగ్గర పరిశీలనకు వెళ్లిన కమిషనర్ శేషన్న ఇతర సిబ్బందిని అక్కడికి రావాలని సమాచారం పంపారని, అందరూ వచ్చాక హెల్త్ ఆఫీసర్‌ను పనులకు సంబంధించి ప్రశ్నించగా వారిమధ్య వివాదం చోటుచేసుకున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. అయితే కమిషనర్, ఉప కమిషనర్, హెల్త్ ఆఫీసర్, ఎంఈల మధ్య పొసగకపోవటం, ఒకరంటే ఒకరికి పడకపోవడంతో వివాదం మరింత ముదిరిందని చెబుతున్నారు. ఈ గొడవపై కమిషనర్ శేషన్నను ప్రశ్నిస్తే.. పారిశుధ్య పనులకు సంబంధించి వివరాలు అడ గ్గా ఆమె తెలియదని సమాధానం చెప్పారని, ప్రత్యేకించి ఆమె ఒక్కరిపైనే సీరియస్ కాలేదని, అ క్కడ ఉ న్న సిబ్బందిపైనా పనితీరు మార్చుకోవాని హెచ్చరించానని, అయితే ఆమె అలా ఎందుకు తననే టార్గెట్ చేసినట్లు భావించారో అర్థం కాలేదన్నారు. హెల్త్ ఆఫీసర్‌ను ప్రశ్నిస్తే ఈ విషయాన్ని రచ్చకెక్కించదలచుకోలేదని, ఉన్నతాధికారులు నన్ను కావాలనే టార్గెట్ చేసి వేధిస్తున్నారని, నేను భరిస్తూనే వచ్చానని, పదిమంది మధ్య మాట్లాడటంతో బాధనిపించి ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. ఆయిల్ బిల్లుల వ్యవహారంలో తన ప్రమేయం లేకుండా నేరుగా పంపుతున్నారనే ఆరోపణ, పారిశుధ్య కార్మికుల కాంట్రాక్ట్ విషయంలో స్పర్థలు ఉన్నాయన్న విషయాన్ని ప్రస్తావిస్తే... అవన్నీ బయటకు చెప్పనని, మా మధ్యే పరిష్కరించుకుంటామని బదులిచ్చారు. కాంట్రాక్టర్ల నుంచి వచ్చే మామూళ్లు ఒకరికి అందకుండా మరొకరు దోచేస్తున్నారని, కాంట్రాక్ట్ వాహనాల విషయంలో కాంట్రాక్టర్‌కు దోచిపెడుతూ దానికి తగ్గట్టు వాటాలు దోచేస్తున్నారనే పలు అంశాలకు సంబంధించి విభాగాధిపతులు, ఇతర సిబ్బంది మధ్య మాటల యుద్ధం జరుగుతోందని సమాచారం. ఈ వ్యవహారాల్ని మంత్రి నాదెండ్ల మనోహర్ దగ్గరకు తీసుకువెళ్లాలనే ఆలోచనలో కూటమి నాయకులు ఉన్నట్లు సమాచారం.

పంపిణీ చేయకుండానే.. పాడయ్యాయి

"గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు పరిష్కరించడంతో, ఎస్సీ యువతను గ్రూపులుగా చేసి స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కొనుగోలు చేసిన ఆ స్వయం ఉపాధి యూనిట్లు నాలుగేళ్ళుగా గోదాములకే పరిమితం అయ్యాయి.....కోట్లాది రూపాయలు ప్రజాధనం వెచ్చించి కంపెనీల నుంచి కొనుగోలు చేసిన ఆ పరికరాలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టి పోతున్నా, గోదాముల గోడలు కూలి ధ్వంసం అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నా ఎస్సీలు, ఎస్టీలు, నా బీసీలు అంటూ నాడు డాంబికాలు పలికిన జగనన్నకు ఆయా యూనిట్లు పంపిణీ చేయాలన్న స్పృహ రాకపోవడంతో నాడు ఎస్సీల స్వయం ఉపాధి కాగితాలకే పరిమితమైన వైనమిది."

- గోదాములకే పరిమితమైన ఎస్సీల స్వయం ఉపాధి యూనిట్లు
- తుప్పు పట్టి, ధ్వంసమైపోతున్నా పట్టించుకోని వైనం
- భారీ సంఖ్యలో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు
- నాలుగేళ్ళయినా పంపిణీ చేయని ఎస్సీ కార్పొరేషన్



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం పక్కన షెడ్డులో గోడకూలి అద్దాలు ధ్వంసమైన ఆటో

గుంటూరు(విద్య), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నాడు టిడిపి ప్రభుత్వం అనేక స్వయం ఉపాధి పథకాలు అమలు చేసింది. ప్రత్యేకించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు రుణాలు ఇప్పించి ఎస్సీ యువత సొంత కాళ్ళపై నిలబడేలా చేశారు. అయితే 2019 తరువాత అధికారంలో వచ్చిన వైకాపా ప్రభుత్వం ఎస్సీ స్వయం ఉపాధి పథకాల్ని సమాధి చేసింది. అమలు చేసిన ఒకటీ అరా పథకాలు కూడా ఎస్సీలకు చేరలేదు. ఇందుకు ప్రత్యేక్ష నిదర్శనమే గోదాముల్లో మూలుగుతున్న స్వయం ఉపాధి యూనిట్లు. గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం అమలు చేయడంతోపాటు ఎస్సీ యువతను గ్రూపులుగా చేసి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎస్సీ కార్పొరేషన్ నిధులతో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు కొనుగోలు చేశారు. అయితే వీటి కొనుగోళ్లలో భారీ మొత్తం కమీషన్ల రూపంలో చేతులు మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆటో రూ.2.50లక్షలు, ట్రాక్టర్ రూ.5.60లక్షలు, మినీ ఎక్సకవేటర్‌కు రూ.10లక్షలు వెచ్చించినట్లు సమాచారం. రాష్ట్ర స్థాయిలో పెద్దమొత్తంలో ఆయా పరికరాలు కొనుగోలు చేశారు. జిల్లాల వారీగా పంపిణీ చేయాలని, వాటిని జిల్లా కేంద్రాల్లోని ప్రైవేటు గోదాములకు తరలించారు. అయితే పంపిణీ చేయక ముందే, ఈ ఆటోల్లో సాంకేతిక సమస్యలు వచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారు. బ్యాటరీ బ్యాకప్ లేకపోవడం, చార్జింగ్ సమస్యలు తలెత్తాయి. దీంతో కంపెనీలకు సమాచారం ఇచ్చినా వారు సకాలంలో రాలేదు. ఫలితంగా పంపిణీ నిలిచిపోయింది. దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి ఈ యూనిట్లు జిల్లా కేంద్రాల్లో గోదాముల్లో, ఎస్సీ కార్పొరేష్ కార్యాలయాల ఆవరణలో మగ్గుతున్నాయి. ఇందులో కొన్ని ఇప్పటికే ఉపయోగించడానికి వీలులేకుండా పాడైనట్లు సమాచారం. గుంటూరు నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ సమావేశ మందిరం పక్కనే ప్రస్తుతం పదుల సంఖ్యలో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వయం ఉపాధి యూనిట్లు ఎస్సీ యువతకు పంపిణీ చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతులు చేయించి పంపిణీ చేస్తాం

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గత ప్రభుత్వ హయాంలో వీటిని కొనుగోలు చేశామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పీ ప్రేమకుమారి "ఆంధ్రజ్యోతి"కి వివరించారు. ఈ ఆటోలు, ట్రాక్టర్స్, ఎక్సవేటర్లు కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా పంపిణీ చేయలేదని, వాటికి మరమ్మతులు నిర్వహించి లబ్ధిదారులకు లేదా మున్సిపాల్టీలకు ఇవ్వాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించినట్లు ఈడీ ప్రేమకుమారి తెలిపారు.



ఎటువంటి రక్షణ లేకుండా ఆరుబయట ఉన్న ట్రాక్టర్లు

ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



కొల్లిపర మండలం మున్నంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

6

దేగల కష్టానికి ప్రతిఫలంగా ఏపీఐడీసీ చైర్మన్ పదవి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మంత్రి సవితకు జ్ఞాపికను అందజేస్తున్న దేగల ప్రభాకర్

సౌత్ ఇండియా పోటీల్లో జిల్లా లిఫ్టర్ల ప్రతిభ



పతకాలు సాధించిన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని సేలంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన పవర్ లిఫ్టర్లు రెండు స్వర్ణ పతకాలు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలు సాధించినట్టు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. మహిళల 84 కిలోలు పైబడిన సీనియర్స్ విభాగంలో బొల్లినేని చంద్రిక స్వర్ణ పతకంతోపాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్-2, జూనియర్స్ 84 కిలోలు పైబడిన విభాగంలో ఎస్కే షబీనా స్వర్ణ పతకం, సబ్‌జూనియర్స్‌లో పి.శ్రావణి రజతం, జూనియర్స్‌లో చాతుర్య, వినయశ్రీలు కాంస్య పతకాలు, పురుషుల సబ్‌జూనియర్స్ విభాగంలో జి.హేమవర్ధన్ రజత పతకం, జి.నాగగణేష్ కాంస్య పతకం సాధించారని చెప్పారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, సౌత్‌ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్‌ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

7న విజ్ఞాన్ యూనివర్సిటీలో స్నాతకోత్సవం



పోస్టర్స్ విడుదల చేస్తున్న వీసీ నాగభూషణ్

గుంటూరు(విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు డిసెంబర్ 7న స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు కలిసి స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావ్ హాజరవుతారని తెలిపారు. స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ (ఎంబీఏ, ఎంసీఏ) ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా విద్య పూర్తి చేసుకున్న 880 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని వైస్ ఛాన్సలర్ నాగభూషణ్ తెలిపారు.

కృషి, పట్టుదలతో ఉజ్వల భవిష్యత్తు

పెదకాకాని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో అనుకున్న రంగాల్లో రాణించాలంటే కృషి, పట్టుదల అవసరమని, తద్వారా ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని ఏఎన్‌యూ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగ అధిపతి, దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో ఉన్న ఆమోదిని స్వచ్ఛంద సంస్థలో భోజన వితరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. నేటి సమాజానికి రోల్ మోడల్‌గా నిలవాలని సూచించారు. సమాజంపై అవగాహనతో సేవా కార్యక్రమాలు నిర్వహించటం సంతోషకరమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 40.72 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు.

డేగల కష్టానికి ప్రతిఫలంగా ఏపీఐడీసీ చైర్మన్ పదవి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- అట్టహాసంగా డేగల అభినందన సభ
- ఎమ్మెల్యేలు, కూటమి నేతల సందడి
- కదం తొక్కిన డేగల యూత్, అభిమానులు



నగరంలో జరిగిన ర్యాలీలో డేగల ప్రభాకర్, అభిమానులు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పార్టీ కోసం నిలిచి, అవిశ్రాంతంగా పోరాడిన డేగల ప్రభాకర్‌ను ఏపీఐడీసీ చైర్మన్‌గా నియమించి ముఖ్యమంత్రి చంద్రబాబు తగిన గౌరవాన్ని కల్పించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కొనియాడారు. ఏపీఐడీసీ చైర్మన్‌గా నియమితుడైన సందర్భంగా బుధవారం డేగల అభిమానులు, డేగల యూత్ సభ్యులు అట్టహాసంగా ఆయన అభినందన సభ నిర్వహించారు. గుంటూరు నాజ్‌సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి సిద్ధార్థ గార్డెన్స్ వరకూ కూటమి పార్టీల కార్యకర్తలు, డేగల అభిమానులు, యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని నగర వీధుల్లో సందడి చేశారు. సిద్ధార్థ గార్డెన్స్ వద్ద ఆయనకు అభిమానులు భారీ గజమాలతో ఘనం స్వాగతం పలికారు. అనంతరం సిద్ధార్థ గార్డెన్స్‌లో నిర్వహించిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, అతిథులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరై డేగల ప్రభాకర్‌కు అభినందనలు తెలిపారు. మంత్రి సవిత మాట్లాడుతూ పార్టీ కోసం, కార్యకర్తల కోసం నిరంతరం శ్రమించిన డేగల ప్రభాకర్‌కు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడం అభినందనీయమన్నారు. ఈ పదవితో ప్రభాకర్‌కు బాధ్యత మరింత పెరిగిందన్నారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపనకు తనదైన శైలిలో కృషి చేయాలన్నారు. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ పార్టీకి కష్టకాలంలో అండగా, ఆర్థికంగా, చేయూతగా ప్రభాకర్ నిలబడ్డారని కొనియాడారు. పరిశ్రమలను అభివృద్ధి చేయాలని సూచించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసేవారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందనటానికి నిదర్శనం డేగల ప్రభాకర్‌ను చైర్మన్‌గా నియమించడమేనని అన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి మాట్లాడుతూ గుంటూరు నగర అభివృద్ధిలో డేగల ప్రభాకర్ ముందుండాలని ఆకాంక్షించారు. డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కష్ట పడేవారికి తగిన గుర్తింపు ఉంటుందనటానికి నిదర్శనం తనకు ఈ పదవి దక్కడమేనని అన్నారు. తనకు ఈ పదవి కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను మూసివేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తోందని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తూ, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి, బాపట్ల ఎమ్మెల్యే వేగేసిన నరేంద్ర వర్మ, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ మంత్రులు మోపిదేవి వెంకటరమణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, లిడ్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టెక్నాలజీ సంస్థ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, టూరిజం చైర్మన్ నుకసాని బాలాజీ, కోవెలమూడి రవీంద్ర, డిప్యూటి మేయర్ షేక్ షాజిల, రాష్ట్ర నాయకులు చిత్తబత్తిన చిట్టిబాబు, కనపర్తి శ్రీనివాస్, మద్దిరాల మ్యాని, కాసుకుర్తి హనుమంతరావు, బీసీ సెల్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, ఆమంచి స్వాములు, తెలుగు యువత నాయకులు మల్లి, ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్, గాదె వెంకటేశ్వర్లు, పార్వతి నాయుడు, వడ్రాణం మార్కండేయ బాబు పాల్గొన్నారు.

ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం కొల్లిపర మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ భార్గవ్‌తేజతో కలిసి ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఎంత మేర కొనుగోలు చేశారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమాన్‌పాలెంలో జరిగిన సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉన్నా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు 24 గంటల వ్యవధిలోనే వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఏడీఏ ఉషారాణి, సివిల్ సప్లై డీఎం శ్రీలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థ, వివిధ శాఖాధికారులు, నాయకులు వంగా సాంబిరెడ్డి, అడపా నారాయణరెడ్డి, మొవ్వా వెంకయ్య, ఆళ్ల వీరారెడ్డి, యర్రు వెంకయ్యనాయుడు, భీమవరపు కిశోర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.



దుగ్గిరాల మండలం గొడవర్రు సమీపంలో రైతులతో ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

క్రిమినల్ కేసులు పెడతాం..

తాడేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వ్యాపారస్తులు కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొంటే క్రిమినల్ కేసులు పెడతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు, గుండిమెడ విచ్చేసిన ఆయన ధాన్యం కల్లాల వద్ద రైతులతో మాట్లాడి ధాన్యాన్ని పరిశీలించారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నేతలు పల్లె కృష్ణ, పి.సుబ్బారావు, బొప్పన గోపాలరావు, శివనాగేశ్వరరావు, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం సాయంత్రం జంపని గ్రామంలో రైతులను కలుసుకున్నారు. రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు.

రైతులు సద్వినియోగం చేసుకోండి

దుగ్గిరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి ప్రభుత్వం ఇస్తున్న మంచి ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండల గ్రామం గొడవర్రు సమీపంలో కరకట్ట అంచున రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించిన మంత్రి మనోహర్ రైతులతో మాట్లాడుతూ క్వింటాల్‌కు రూ.2300 నుంచి రూ.2320, 75 కిలోల బస్తాకు రూ.1725 నుంచి రూ.1740 చెల్లిస్తోందన్నారు. సర్పంచ్ విశ్వనాధపల్లి ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శివకుమార్, జేసీ ఎ.భార్గవ్‌తేజ, వీఆర్వోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అధికారులపై మంత్రి ఆగ్రహం

కొల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు అమ్మి నష్టపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. బుధవారం కొల్లూరు మండలంలోని ఈపూరు, క్రాప గ్రామాల వద్ద రైతులు రోడ్లపై ఆరబెట్టుకున్న ధాన్యాన్ని మంత్రి పరిశీలించారు. తేమశాతం ఎక్కువగా ఉందనీ, నిబంధనలకు లోబడి ఉంటేనే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. పైగా చాలా మంది రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది ఈకేవైసీ, ఈక్రాప్ చేయలేదనీ, దాని వల్ల కూడా తమ పంట కొనుగోలు చేయమంటున్నారని చెప్పారు. క్రాప వద్ద రైతులు కౌలు రైతు కార్డులు కూడా తమకు జారీ చేయలేదని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో అధికారులపై వచ్చిన ఆరోపణలపై వారిని ప్రశ్నించగా ఆయా శాఖల అధికారులు నీళ్లు నమలడంతో వారిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సప్లై జిల్లా అధికారి విలియమ్స్, వ్యవసాయ శాఖ డీఏవో రామకృష్ణ, రేపల్లె ఏడీఏ విజయబాబు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఏవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు గండం

(5 పేజీ తరువాయి)

సవాలక్ష కొర్రీలు పెట్టి వాటిని రిజిస్టర్ చేయకుండా ఆపుతున్నారు.

అసైన్డ్, ఫారెస్టు ల్యాండు వంక

రైతులు ఇచ్చిన భూములు పట్టాభూములైతేనే రిజిస్ట్రేషన్ చేస్తామని, అసైన్డ్ భూములు ఉంటే వాటిని చేయమని ఆపారు. కొంతమంది రైతులు పట్టా భూములతోపాటు అసైన్డ్, ఫారెస్టు, సైనికులకు ఇచ్చిన భూములను కూడా ల్యాండ్ పూలింగులో ఇచ్చారు. ఇప్పుడు ఆ వంక పెట్టి వాటి రిటర్నబుల్ ప్లాట్లను సీఆర్డీఏ అధికారులు ఆపేశారు. వాటితోపాటు పట్టా భూములు కూడా ఇచ్చి ఉంటే వాటిని కూడా ఆపేశారు. దీంతో రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చినా సీఆర్డీఏ అధికారుల తీరులో ఏమాత్రం మార్పు రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా కౌలు బకాయిలు

రాజధాని కోసం భూములిచ్చిన అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ విచారణ పేరుతో గత ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగింది. అసైన్డ్ రైతుల భూములను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టింది. మొత్తం 1600 మంది రైతుల పొలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి 1300 మందికి క్లీన్ చిట్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన 1300 మందికి క్లీన్‌చిట్ వస్తుందని, అందరితోపాటు తమకు కౌలు వస్తుందని భావించారు. కానీ అసైన్డ్ రైతుల ఆశ నిరాశగానే మిగిలింది.

కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అవుతున్నా వారి భూములు ఇప్పటికీ నాట్ ట్యాలీడ్ జాబితాలోనే ఉన్నాయి. మూడేళ్లుగా కౌలు బకాయిలు అలానే ఉన్నాయి. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అసైన్డ్ రైతులు సీఆర్డీఏ అధికారుల తీరును నిరసిస్తున్నారు. సీఐడీ విచారణ పేరుతో కౌలు చెల్లించకుండా జాప్యం చేస్తున్న ప్రభుత్వ తీరుపైనా వారు ఆగ్రహంతో ఉన్నారు. మంత్రి నారాయణ, నారా లోకేశ్‌లను కలిసి తమ గోడు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో టీడీపీకి చెందిన పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికలోడుతో ప్రయాణం నిషేధం

- రూ.20 వేలతోపాటు టన్నుకు రూ.2 వేలు జరిమానా
- రవాణా శాఖాధికారి టి.సంజీవ్ కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మోటార్ వాహన చట్టం ప్రకారం అనుమతించిన వాహనాలు బరువుకు మించి అధికలోడుతో ప్రయాణించడం నిషేధం. అనుమతించిన బరువు కన్నా 5.1 వరకు మార్జిన్ ఉంది. అంతకుమించి బరువుతో వాహనాలు రహదారుల్లో ప్రయాణిస్తే జరిమానాలు విధిస్తాం' అని రవాణాశాఖాధికారి టి.సంజీవ్ కుమార్ తెలిపారు. 'మామూళ్ల ఓవర్‌లోడ్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం వెలువడిన కథనానికి ఆయన స్పందించారు. అనుమతికి మించి అధిక లోడ్‌తో టిప్పర్లు, లారీలు ప్రయాణిస్తే మోటార్ వాహన చట్టం ప్రకారం రూ.20వేలతో పాటు అదనంగా ప్రతి టన్నుకు రూ.2 వేలు జరిమానా విధించడంతోపాటు డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అధిక లోడ్‌తో ప్రయాణిస్తున్న వాహనాలను గుర్తించి వారిపై 29 కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాగా రూ.12,84,700 వసూలు చేసినట్లు తెలిపారు. అధిక లోడుతో వాహనాలు తిప్పకుండా టిప్పర్ యజమానులు రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ వన్ టౌన్ సీఐ లత, ఎస్ఐలు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మద్యాన్ని తీసుకొచ్చి గుంటూరులో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ వన్ టౌన్ సీఐ బి.లత బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ ఇంతియాజ్ అలియాస్ మున్న అనే వ్యక్తి తెలంగాణ రాష్ట్రం నుంచి 13 మ్యాన్షన్ హౌస్ బ్రాందీ బాటిళ్లను తీసుకొచ్చి ద్విచక్ర వాహనంపై పొన్నూరు రోడ్డులోని కరెంట్ ఆఫీస్ వద్ద విక్రయిస్తున్నాడు. అదేవిధంగా టూ టౌన్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని లాలుపురం గ్రామానికి చెందిన దేవరశెట్టి శ్రీనివాసరావు అనే వ్యక్తి చిలకలూరిపేట రోడ్డులో ఏటుకూరు రోడ్డు సమీపంలోని హైవే అండర్ పాస్ వద్ద 12 తెలంగాణ మద్యం బాటిళ్లను ద్విచక్ర వాహనంపై తిరుగుతూ విక్రయిస్తున్నాడు. సమాచారం మేరకు వీరిద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద 25 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్సైలు తిరుమలేశ్వరరావు, మహమ్మద్ ఖాసిం షరీఫ్, కానిస్టేబుళ్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా నంద్యాల మార్గంలో కొన్ని రైళ్లను రద్దు, మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి. డిసెంబరు 3 నుంచి 13వ తేదీ వరకు నంబరు 17228 గుంటూరు - డోన్, డిసెంబరు 4 నుంచి 14వ తేదీ వరకు నంబరు 17227 డోన్ - గుంటూరు రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నామని పేర్కొన్నాయి. డిసెంబరు 6వ తేదీన నంబరు 22883 పూరీ - యశ్వంత్‌పూర్, 7వ తేదీన నంబరు 22884 యశ్వంత్‌పూర్ - పూరీ, డిసెంబరు 4, 11 తేదీల్లో నంబరు 22831 హౌరా - యశ్వంత్‌పూర్, డిసెంబరు 6, 13 తేదీల్లో నంబరు 22832 యశ్వంత్‌పూర్ - హౌరా ఎక్స్‌ప్రెస్‌లను నంద్యాల నుంచి దారి మళ్లిస్తారు. నంబరు 17253 గుంటూరు - ఔరంగాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని డిసెంబరు 4 నుంచి 12వరకు 120 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేసి నడుపుతామని రైల్వేవర్గాలు తెలిపాయి.

హాల్ట్‌స్టేషన్‌గా మారిన చినరావూరు

తెనాలి - రేపల్లె సెక్షన్‌లో ఉన్న చినరావూరు రైల్వేస్టేషన్‌ని రైల్వేబోర్డు హాల్ట్‌స్టేషన్‌గా మార్పు చేసింది. 2025 జనవరి 1వ తేదీ నుంచి ఈ ఉత్తర్వులు అమలులోకి రానున్నాయి. దీంతో ఆ సెక్షన్‌లో ఒక్క వేమూరు మినహా అన్ని హాల్ట్‌స్టేషన్లుగా మారాయి.

వికాస ఎన్నికలకు నామినేషన్లు దాఖలు

పెదకాకాని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలకు బుధవారం నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్ తెలిపారు. కాగా ఉద్యోగులు ఫ్రెండ్స్ ప్యానెల్‌గా ఏర్పడి నామినేషన్ వేశారు. ఫ్రెండ్స్ ప్యానెల్ అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్.ప్రసాద్ (అధ్యక్షుడు), డి.విజయ ప్రకాష్ బాబు (ఉపాధ్యక్షుడు), జె.శ్రీనివాసరావు (కార్యదర్శి), టి.వెంకటేష్, ఎన్.నాగేశ్వరరావు (సంయుక్త కార్యదర్శులు), కె.యేషయ్య (కోశాధికారి), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా.. జి.శ్రీను, కె.శశిధర్, పి.నాగరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, ఇ.శ్రీనివాస రెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వరరావు, సీహెచ్ సాంబశివరావు, సీహెచ్ ఆనంద్ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్. మురళీ మోహన్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114,122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

43,594 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 46,174 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,594 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 38,956 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13500	334	8000	14500
నెంబరు. 5	8500	12000	నెంబరు.5	8300	12500
273	8200	10000	273	9500	11000
341	8000	14000	341	8000	14500
4884	--	--	4884	8000	14000
సూపర్ 10	11500	11500	సూపర్ 10	9000	11500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	8000	12600
దేవనూరు డీలక్స్	8000	13500	దేవనూరు డీలక్స్	10000	13000
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4500	10000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు(విద్య),నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వీఆర్ జ్యోత్స్న కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీ సెట్ రాయకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంఎస్సీ జువాలజీ, కెమిస్ట్రీ, ఎంఏ ఎకనామిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, కళాశాలలో హాస్టల్ సౌకర్యం ఉందని తెలిపారు. ఇతర వివరాలకు 9985904415 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కార్యాచరణ ప్రతిపాదనల్లేకుండానే ముగిసిన కాప్-29 సదస్సు

గుంటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల కారణంగా తలెత్తుతున్న దుష్ప్రభావాలను తగ్గించేందుకు అజర్‌బైజాన్‌లోని బాక్‌లో జరిగిన కాప్-29 సదస్సు ఫలవంతమైన కార్యాచరణను ప్రతిపాదించకుండానే ముగిసిందని జన విజ్ఞాన వేదిక నాయకుడు సీహెచ్ చలమారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11న మొదలైన కాప్-29 సదస్సు 22 వరకు జరిగిందని, ఈ సదస్సులో ఎటువంటి కార్యాచరణ ప్రతిపాదనలు లేకపోవడం సంపన్న దేశాల స్వార్థ గుణాన్ని, పర్యావరణంపై వాటి పాక్షిక దృష్టిని మరోసారి బయటపెట్టాయని విమర్శించారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పీవీ సత్యనారాయణ, ఏవీ సాయిరామ్, మురళీకృష్ణ, హను మంతరావు ఉన్నారు.

రింగ్‌రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు కదిలిన అధికారులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలో బైక్‌రేస్‌లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోన్న ఆకతాయిలకు వేగానికి కళ్ళెం వేసేందుకు ఎట్టకేలకు అధికార యంత్రాంగం నడుం బిగించింది. కొంత కాలంగా రింగ్ రోడ్డులో బైక్‌ల విన్యాసాలు పెరగడంతో జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో పలువురు మృతి చెందిన విషయం విదితమే. ఈ పరిస్థితిపై 'ఖాకీ కనపడదు-సైరన్ వినపడదు' అనే శీర్షికన 'ఆంధ్ర జ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పందించారు. రింగ్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుపై బుధవారం నగరపాలక సంస్థ అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించారు. గుజ్జనగుండ్ల కూడలి - కొరిటిపాడు - గుజ్జన గుండ్ల కూడలి వరకు ఒక్కొక్క మార్గంలో ఐదు చోట్ల, రెండు మార్గాల్లో 10 స్పీడ్ బ్రేకర్లు అవసరమని గుర్తించారు. ఏ ఏ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలో సూక్ష్మ పరిశీలన చేశారు. స్పీడ్ బ్రేకర్ కూడా ఆర్‌అండ్‌బీ విధానంలో మూడు వరుసలుగా ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుందని ఆలోచన చేశారు. రెండు, మూడు రోజుల్లో బ్రేకర్లను ఏర్పాటు చేయనున్నట్లు సీఐ సింగయ్య విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ, తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరస్వామి ప్రతిమ తొలగింపుపై వివాదం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ మూడో లైన్ ఉన్న శ్రీ వెంకటేశం అపార్టుమెంట్ సెల్లార్‌లోని వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని పాక్షికంగా తొలగించడంపై వివాదం నెలకొంది. 2006లో ఈ అపార్టుమెంట్‌ను నిర్మించారు. అందులో మొత్తం 20 ఫ్లాట్లు ఉన్నాయి. అయితే, సెల్లార్‌లో ఉన్న విగ్రహం తమ బాత్రూం కిందకు వస్తుందని వాస్తు రీత్యా అలా ఉండడం మంచిది కాదని దానిని అక్కడ నుంచి తొలగించి వేరేచోట ప్రతిష్టించుకుందాం అని ఆ అపార్టుమెంట్‌లోని కొందరు సూచించారు. ఇందుకు మిగిలిన ఫ్లాట్‌ల వాళ్ళు ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కాశయ్య, దేవరశెట్టి సుబ్బారావు, ఎలక్ట్రిసిటీ డీఈ ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు ఆ విగ్రహాన్ని కూలుస్తుండగా అపార్టుమెంట్ వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- మహానగరాలకు దీటుగా తీర్చిదిద్దుతాం
- సమగ్ర అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే మాధవి
- కూటమి ప్రభుత్వంలో శరవేగంగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. నియోజకవర్గంలోని 45వ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధి పనులకు బుధవారం ఆమె శంకు స్థాపన చేశారు. డివిజన్‌లోని శాంతినగర్ 1, 2 లైన్లలో రూ.30 లక్షలతో 646 మీటర్ల సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గౌతమీనగర్ 5వ లైన్‌లో రూ.28.70 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులు, ముత్యాలరెడ్డినగర్ పదో లైన్‌లో రూ. 9.90 లక్షలతో 60 మీటర్ల పైపులైను, సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని మహానగరాలకు దీటుగా దీర్చిదిద్దుతామని అన్నారు.

గత పాలకుల అసమర్థతతో నియోజక వర్గంలో అనేక చోట్ల యూజీడీ పనులు నిలిచి పోయా యని అన్నారు. మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ సహకారంతో పనులను త్వరలోనే చేపడతామని హామీ నిచ్చారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయని, మౌలిక సదుపాయాల కల్ప నతో పాటు, కనీస సౌకర్యాలను కచ్చితంగా కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో వీ వెంకటేశ్వరరావు, కే కోటేశ్వరరావు, డీ శ్రీనివాసరావు, ఎం రాజేష్, కే బాజి, రఫీ, సాయి, బీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

53వ డివిజన్‌లో..

గుంటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని ఆరో డివిజన్‌లో రూ.9.95 లక్షలతో, 53వ డివిజన్ శారదా కాలనీ 22వ లైన్ నుంచి 29వ లైన్ వరకు రూ. 75.90 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఒక్క తన నియోజకవర్గమే కాకుండా, యావత్ రాష్ట్రమే సంక్షేమం, అభివృద్ధి దిశగా పయనిస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎక్కడా వర్షపు నీరు, డ్రైనేజ్ నీరు నిలిచే పరిస్థితి లేకుండా రోడ్లు, డ్రెయిన్లు నిర్మించి అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని అన్నారు. ప్రజలందరూ పార్టీ సభ్యత్వాన్ని తీసుకొని టీడీపీ కుటుంబసభ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ పీ సమత, జీ ప్రభాకర్, జీ దయారత్నం, మహంకాళి నరసింహారావు, సీహెచ్ సింధు, ఆనంద్, కే వెంకట్, బాబురావు, జనసేన నాయకులు కిషోర్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

18 ఏళ్లు నిండితే ఓటు హక్కు కలిగి ఉండాలి: జీఎంసీ కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని గుంటూరు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ పులి శ్రీనివాసులు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, జిల్లా ఎన్నికల అధికారి సూచనలతో స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులకు బుధవారం ఓటు హక్కుపై అవగాహన స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం) కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటు ద్వారా తమకు నచ్చిన, సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకునే వీలు కలుగుతుందని, ప్రజా స్వామ్యంలో ఓటు చాలా కీలకమని చెప్పారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను బీఎల్‌ఓల ద్వారా లేదా ఆన్‌లైన్ ద్వారా కూడా చేసుకోవచ్చని వివరించారు. నూతన ఓటర్ కార్డులు జనవరి 25 నాటికి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఏఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, స్వీప్ నోడల్ అధికారి దుర్గాబాయి, స్కూల్ ఎడ్యుకేషన్ ఏడి నిర్మలారాణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న కుమారి పాల్గొన్నారు.

ఎంఆర్‌ఎఫ్ ని సమర్థవంతంగా నిర్వహించాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పొన్నూరు రోడ్డు ఎంఆర్‌ఎఫ్ ని సమర్థ వంతంగా నిర్వహించాలని, ప్రత్యేక రిజిస్టర్ ద్వారా చెత్త తరలింపు వాహనాల ట్రిప్‌ల వివరాలు నమోదు చేయాలని ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మెటీరియల్ రికవరీ ఫెసిలిటి సెంటర్ (ఎంఆర్‌ఎఫ్)ని, కొండయ్య కాలనీ, రాజీవ్ గాంధీనగర్, శ్యామలానగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు.



ఎంఆర్‌ఎఫ్‌ని పరిశీలిస్తున్న కమిషనర్

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, నీటి పన్నుబకాయిల వసూళ్లపై అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా పన్నుల వసూళ్లపై సమీక్షించి, వసూళ్ల లక్ష్యానికి తగిన విధంగా లేవని, రెండు రోజుల్లో వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పన్ను వసూళ్లకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు.

ఆక్రమణల తొలగింపు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని మస్తాన్ దర్గా వెనుక క్లాత్ బజార్‌లో కొన్ని సంవత్సరాలుగా వివాదాస్పదంగా ఉన్న ఆక్రమణలను పోలీసులు భారీ బందోబస్తు మధ్య తొలగించారు. ఓ వ్యక్తి తన స్థలాన్ని ఆక్రమించి ఖాళీ చేయడంలేదని బాధితులు కోర్టును ఆశ్రయించారు. అయినప్పటికీ స్థల యజ మానికి అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. ఇల్లు ఖాళీ చేయించాలని పోలీసు శాఖను ఆదేశించింది. దీంతో, బుధవారం పోలీసు బలగాలు ఆ ప్రాంతంలో మోహరించి సిబ్బంది ఆయా ఇళ్ళను కూల్చి వేశారు. కొందరు బాధితులు ఆక్రమణ తొలగింపును అడ్డుకునేందుకు యత్నించారు. టీడీపీ, వైసీపీ నేతలు బాధితుల తరపున ఆందోళనకు దిగగా, వారిని అదుపులోకి తీసుకొని ఆక్రమణల తొలగింపు కొనసాగించారు.



నగరంపాలెం స్టేషన్ పరిధిలో తొలగిస్తున్న ఆక్రమణలు

29న కొమ్మారెడ్డి కేశవరెడ్డి సాహితీ పురస్కార ఉత్సవం

గుంటూరు(విద్య),నవంబరు 27(ఆంధ్ర జ్యోతి): యూటీఎఫ్ సీనియర్ నాయకులు, ఉపాధ్యాయ పత్రిక మాజీ సంపాదకుడు సాహితీవేత్త కొమ్మారెడ్డి కేశవరెడ్డి సాహితీ పురస్కార ఉత్సవం ఈ నెల 29 సాయంత్రం 5గంటలకు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఈ ఉత్సవం నిర్వహించనున్నారు. యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు యూ రాజశేఖర్, ఎం కళాధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలి

గుంటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక డొంకరోడ్డులోని మూడు వంతెనల విస్తరణ పనులు జరుగుతున్నందున ప్రజలందరూ ఈ అసౌకర్యాన్ని గుర్తించి సహ కరించాల్సిందిగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి విజ్ఞప్తి చేశారు. గుంటూరు లోని తన క్యాంపు కార్యాలయంలో ట్రాఫిక్ అంశంపై సీఐ సింగయ్యతో బుధవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు వంతెనల వద్ద అదనపు రైల్వే ట్రాక్ విస్తరణ పనులు జరుగుతున్నందున నగరంలో ట్రాఫిక్ డైవర్షన్‌కు ప్రజలందరూ సహకరించాలని కోరారు. డొంకరోడ్డు నుంచి కొత్తపేటకు వెళ్లేవారు శారదాకాలనీ, సంజీవయ్యనగర్ గేటు మీదగా కొత్తపేటకు వెళ్ల వచ్చన్నారు. స్కూలు, కాలేజీ బస్సులు శంకర్ విలాస్ వంతెన మీదుగా కాకుండా లాడ్జి సెంటర్ నుంచి మథర్ థెరిస్సా సెంటర్, లక్ష్మీపురం అయ్యప్పస్వామిగుడి, పట్టాభిపురం బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు. ప్రధాన కూడళ్లలో అధిక సిబ్బం దిని కేటాయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే చెప్పారు.

అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

- పలు పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది పనితీరు పరిశీలన
- ఏ సమయంలో ఫిర్యాదులు వచ్చినా స్వీకరించాలని ఆదేశాలు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం అర్ధ రాత్రి నగరంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వ హించారు. అదేవిధంగా అరండల్‌పేట, పెద కాకాని, నల్లపాడు పోలీస్‌స్టేషన్లు తనిఖీ చేసి సిబ్బంది పని తీరును పరిశీలించారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసి, రాత్రి విధుల్లో ఉన్న సిబ్బంది ఫిర్యాదు దారులకు ఏ విధంగా స్పందిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి ఏ సమయంలో ఫిర్యాదులు వచ్చినా స్వీకరించి తగు చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణ - భద్రత ఏవిధంగా ఉందో తెలుసుకుని, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వివరాలు, వాటి విడుదలకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. నల్లపాడు, అరండల్ పేట పోలీస్‌స్టేషన్లను పరిశీలించారు. బ్రాడీపేటలోని పలు వీధులను పరిశీలించి, అర్ధరాత్రి సమయాల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న యజమానికి కౌన్సెలింగ్ నిర్వహించి, పోలీస్ వారి నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని హైవేపై ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని, జాతీయ రహదారుల అథారిటీ వారితో సమన్వయం చేసుకుని ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి అక్కడ ప్రమాద హెచ్చరికలను ఏర్పాటు చేయాలని సీఐ నారా యణ స్వామికి ఎస్పీ సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో లాకప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ముఖ్యం

గుంటూరు సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమని, యువత ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసే వాటి వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు పిలుపు నిచ్చారు. స్థానిక చుట్టుగుంటలోని సమగ్ర శిశు సంక్షేమ శాఖ సెక్టార్ -1 కార్యాలయంలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బుధవారం 'మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగం'పై వర్క్‌షాప్ నిర్వహించారు.

30 నుంచి సైక్లింగ్ రాష్ట్ర స్థాయి ఎంపికలు

గుంటూరు(తూర్పు), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి రెండు రోజుల పాటు సైక్లింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీవో పీ.నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుళ్లూరు మండలం మందడంలోని గుడ్‌షెఫర్డ్ ఇంగ్లీషు మీడియం పాఠశాల ఆవరణలో ఈ ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు అదే రోజు ఉదయం 8 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 7న ఒరిస్సాలోని పూరిలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 98493 79932, 97030 92077 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తపాలా స్టాంప్‌లలో తెలుగువారి ఆత్మగౌరవం ప్రతిబింబించాలి

- ఫిలాటెలిక్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ) సమావేశంలో మంత్రి పెమ్మసాని

గుంటూరు(తూర్పు), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భారతదేశ సంప్రదాయం, చరిత్రకారులు ఘనతతో పాటు, తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ప్రతిబింబించేలా తపాలా స్టాంపుల ఆవిష్కరణలు జరగాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌అన్నారు. ఢిల్లీలోని డాక్ భవన్‌లో జరిగిన ఫిలాటెలిక్ అడ్వైజరీ (పీఏసీ- తపాలా స్టాంపుల విభాగం) ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమా వేశానికి పెమ్మసాని చంద్రశేఖర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. భారతీయ వారసత్వ సంప దను సంరక్షించడం, దేశ ప్రగతిశీల దృక్పథంలో లోతైన సంబంధాలను పెంపొందించేలా ఫిలా టెలి భవిష్యత్ కార్యక్రమాలు ఉండాలని అన్నారు. త్వరలో విడుదల చేసే తపాలా స్టాంపుల విషయంలో స్పష్టమైన ఆదేశాలను పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం గతంలో జరిగిన జిల్లా, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌ల గురించి సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఆర్ శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో సెప్టెంబరులో విడుదల చేసిన అక్కినేని నాగేశ్వర రావు స్మారక తపాలా స్టాంపు విడుదలలో పెమ్మసాని చొరవను పలువురు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు. ఈ సమావేశంలో 20 వినూత్న స్టాంపులతో పాటు మొత్తం 51 తపాలా స్టాంపులకు ప్రతిపాదనలు ఆమోదించారు. సమావేశంలో ఎంపీలు దేవ్ సింహ చౌహాన్, ఎస్ సెల్వే గానా బాతి, కార్యదర్శి వందిత కౌల్, డైరెక్టర్ జనరల్ సంజయ్ శరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గల్లా అశోక్, పాల్గొన్న దర్శకుడు అర్జున్ జంధ్యాల, ఎమ్మెల్యే నసీర్

అన్ని వర్గాలకు చేరువైన 'దేవకీ నందన వాసుదేవ'

- థియేటర్‌లో సినిమా చూసిన హీరో గల్లా అశోక్

గుంటూరు(తూర్పు), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 'దేవకీ నందన వాసుదేవ' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుందని చిత్ర హీరో గల్లా అశోక్ అన్నారు. విజయయాత్రలో భాగంగా బుధవారం ఆ సినిమా దర్శకుడు అర్జున్ జంధ్యాలతో కలిసి స్థానిక హరిహరమహల్ థియేటర్‌కు వచ్చారు. ప్రేక్షకులతో కలిసి ఈ సినిమాను ఆయన వీక్షించారు. అనంతరం హీరో అశోక్ మాట్లాడుతూ తన తాత సూపర్ స్టార్ కృష్ణ, మేనమామ మహేష్ బాబుల స్ఫూర్తితో సినీ రంగంలోకి వచ్చానని చెప్పారు. చిత్రంలో తనకు తగ్గ కథతో పాటు చిత్రాన్ని అద్భుతంగా మలచడంలో దర్శకుడు అర్జున్ విజయంతమయ్యాడని, భవిష్యత్తులో మంచి సినిమాలలో నటిస్తానని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ ఈ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే న సీర్ మాట్లాడుతూ మంచి పాత్రలు ఎంచుకుంటూ సినీరంగంలో తనకంటూ సుస్థిర స్థానం కోసం ప్రయత్నం చేస్తున్న అశోక్ మరిన్ని విజయవంతమైన సినిమాల్లో నటించాలని ఆకాంక్షించారు. అంతకుముందు, బృందావన్‌గార్డెన్స్ నుంచి హరిహరమహల్ వరకు అభిమానులు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎం రాజేష్, ఆర్ సాయి, సీహెచ్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరు(తూర్పు), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఐపీఎం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యోగుల సంఘ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు జీ మహేష్ కుమార్ ముదిరాజ్ స్పష్టం చేశారు. స్థానిక రీజినల్ లేబొరేటరీ ఆవరణలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల్లో ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అనంతరం మహేష్‌కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ ఐపీఎం ఉద్యోగస్తుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు ఘనంగా సత్కరించారు.

ఓవరాల్ ఛాంపియన్‌గా ఎస్‌పీవీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల జట్టు

గుంటూరు(తూర్పు), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా, డెకాథ్లాన్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో యడ్లపల్లిలోని ఎస్‌పీవీ ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ముగింపు కార్య క్రమానికి హాజరైన జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) పీ నరసింహారెడ్డి, విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. డీఎస్‌డీవో మాట్లాడుతూ బీఆర్ స్టేడియంలో అథ్లె టిక్ ట్రాక్‌ను త్వరలోనే పునరుద్ధరిస్తామనితెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ సంఘ జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు, కోచ్‌లు రోషిని, పీఈటీ పాల్గొన్నారు.



విజేతలతో డీఎస్‌డీవో నరసింహారెడ్డి, కోచ్‌లు



విజేతలతో ఉర్దూ డీఐ ఖాసిం, ఎంఈవోలు రమణయ్య, జ్యోతి కిరణ్ తదితరులు

ఆకట్టుకున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాలల సైన్స్‌మేళా

గుంటూరు(విద్య),నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర సౌజన్యంతో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్న పాఠశాలలకు జిల్లా స్థాయి సైన్సు మేళాను స్థానిక పాతబస్టాండు సెంటర్‌లోని ఉర్దూ బాలుర పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. డీసీఈబీ చైర్మన్ తిరుమలేష్, ఎంఈవోలు రమ ణయ్య జ్యోతి కిరణ్, ఉర్దూ డీఐ ఖాసిం, ప్రధానోపాధ్యాయులు వసుంధర, జిల్లా యూత్ ఆఫీసర్ కిరణ్మయిలు ఈ మేళాను ప్రారంభించారు. సైన్స్ మేళాలో 30 పాఠశాలల నుంచి 70 ప్రాజెక్టులు వచ్చాయని జిల్లా సైన్సు అధికారి షేక్ గౌసుల్ మీరా వెల్లడించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. త్వరలో మరోసారి యూత్ ఫెస్టివల్‌లో నగదు బహుమతులు అందజేస్తామని గౌసుల్‌మీరా తెలిపారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌లుగా శివశంకరరావు, అప్పారావు, బాబురావు మల్లికార్జున రావు వ్యవహరించారు.

విజేతలు వీరే....

వ్యక్తిగత విభాగం: ప్రథమ బహుమతిని నారాకోడూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ద్వితీయ బహుమతిని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల, తృతీయ బహుమని నంబూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారు. గ్రూపు విభాగంలో ప్రథమ బహుమతిని మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల, ద్వితీయ బహుమతిని రావెల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, తృతీయ బహుమ తిని మోతడక శ్రీరామా ఉన్నత పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు.

మినీ మహాభారతం

పల్నాటి యుద్ధం

- పోతుగడ్డలో పారిన వీరుల రక్తం
- యుద్ధభూమిలో ఆయుధ పూజ
- 30 నుంచి వీరారాధనోత్సవాలు


బ్రహ్మనాయుడు విగ్రహం




నాయకురాలు నాగమ్మ విగ్రహం

ద్వాపరయుగంనాటి మహాభారతాన్ని తలపించేది పల్నాటి యుద్ధం. ఈ యుద్ధంలో ఎందరో వీరులు పోరాడి అమరులయ్యారు. ఆనాటి యుద్ధంలో అశువులు బాసిన వీరుల గుండెచప్పుళ్లు ఇప్పటికీ వినబడుతూనే ఉన్నాయి. పదవీ వ్యామోహం, దాయాదుల వైరం, శైవ, వైష్ణవ సంఘర్షణల నేపథ్యంగా క్రీస్తు శకం 12వ శతాబ్దంలో పల్నాటి యుద్ధం జరిగింది. ఇక్కడ ఏటా జరిగే వీరారాధనోత్సవాల్లో కత్తులు నర్తిస్తాయి. పల్నాటి కథను హృద్యంగా ఆలపిస్తాయి, ఇక్కడ ఏ రాయిని చూసినా పల్నాటి పౌరుషం పలుకరిస్తుంది. ఆనాటి యుద్ధ విశేషాలను గుర్తు చేసుకుంటూ 900 ఏళ్లుగా ప్రతి ఏటా ఐదు రోజుల పాటు పల్నాటి వీరారాధనోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

కారంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30 నుంచి వీరారాధనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నలు మూల నుంచి యాత్రికులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఓ కథనం..

పల్నాటి యుద్ధానికి దారితీసిన పరిస్థితులు

పల్నాటి రాజ్యాన్ని అనుగురాజు పరిపాలిస్తున్న తరుణంలో ఒకసారి కారడవిలో నాగమ్మ ఆతిథ్యాన్ని స్వీకరించి సంతృప్తి చెందిన ఆయన, ఆమెకు కొంతకాలం రాజ్యాధికారం ఇవ్వ డంతో పల్నాటి చరిత్రకు అంకురార్పణం జరిగింది. అనుగురాజు గతించి నలగామరాజు రాజుగా, బ్రహ్మనాయుడు మంత్రిగా పరిపాలనా బాధ్యతలు స్వీకరించిన సమయంలో తండ్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోమని నాగమ్మ కోరడంతో విధిలేక నలగామరాజు నాగమ్మకు రాజ్యాధికారం అప్పగించాడు. నాగమ్మ తనకు ప్రాప్తించిన విశేష అధికారాలతో బ్రహ్మనాయుడును దోషిగా చిత్రీకరించి నలగామరాజు సోదరుడు మలిదేవరాజును కారాగారంలో వేయించింది. బ్రహ్మనాయుడు మలిదేవరాజును విడిపించి మాచర్లలో రాజ్యాన్ని ఏర్పాటు చేసి సుభిక్షంగా పాలన సాగించారు. దీంతో, కన్నుకుట్టిన నాగమ్మ, మాచర్ల రాజ్యాన్ని కైవసం చేసుకోవాలని కుయుక్తులు పన్నుతుంది. నాగమ్మ చెప్పుడు మాటలు విని నలగాముడు ఆమె చేతిలో కీలుబొమ్మ అవుతాడు. జూద వ్యసనుడైన బ్రహ్మనాయుడును కవ్వించి గురజాలకు పిలిపించింది. మలిదేవ, బ్రహ్మనాయుడులను కోడి పందేలు ఆడేలా కవ్వించి కుతంత్రంతో వారిని ఓడించి అడవులకు పంపుతుంది. నిర్ణీత కాలం తర్వాత రాజ్యాన్ని, బ్రహ్మనాయుడు చేసిన విజ్ఞప్తిని మన్నించక దూతగా వచ్చిన అలరాజును చంపిస్తుంది. దీంతో, ఆగ్రహోదగ్రుడైన బ్రహ్మనాయుడు యుద్ధం అనివార్యమని తలచి మలిదేవరాజు తరపున యుద్ధానికి దిగుతాడు. ఈ దాయాదులు యుద్ధభూమిగా కారంపూడిని ఎంచుకుని, పద్దెనిమిది రోజులు ఏకధాటిగా నాగులేటి ఒడ్డున పోరాటం చేస్తారు. ఈ పోరులో నాయకురాలు నాగమ్మ, బ్రహ్మనాయుడు చేతికి చిక్కగా స్త్రీ అనే కారణంగా ప్రాణభిక్ష పెట్టడంతో ఆమె పారిపోతుంది. యోధాను యోధులైన వీరులందరూ మరణిస్తారు. కన్నమదాసు, బాలచంద్రుడు, మలిదేవరాజు యుద్ధంలో వీరమరణం చెందుతారు. దీంతో, విరక్తి చెందిన బ్రహ్మనాయుడు రాజ్యాన్ని నలగామరాజుకు అప్పగించి గుత్తికొండ బిలంకు తపస్సు చేసేందుకు వెళ్లడంతో పల్నాటి యుద్ధం ముగుస్తుంది.


పల్నాటి యుద్ధ చిహ్నం

రక్తం కలిపిన అన్నపు ముద్దలు..

ఈ ఉత్సవాల్లో చివరిరోజైన 'కల్లిపాడు'ను రక్తం కలిపిన అన్నపు ముద్దలు పోతురాజు గుట్ట వద్ద ఆకాశంలోకి పీఠాధిపతి విసిరివేస్తారు. ఆ ముద్దలు శక్తులు (వీరులు) స్వీకరిస్తాయని నమ్మకం. ఈ తంతు ఆ నాటి నుం చి నేటి వరకు ఆనవాయితీగా వస్తోంది. నాడు వీరనాయకులు వాడిన ఆయుధాలను నాగులేటిలో స్నానమాచరింపజేసి అలంకరించి ఊరేగిస్తారు. బ్రహ్మన్న (పీఠాధిపతి) ఇచ్చిన తీర్థం తీసుకొని ఆ కొణతములు పోతురాజు గుట్టపై ఒరగడంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

ఐదురోజులు వీరారాధనోత్సవాలు

ఈ నెల 30 నుంచి వీరారాధనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు 30న 'రాచగావు', డిసెంబరు 1న 'రాయభారం', 2న 'మందపోరు', 3న 'కోడిపోరు', 4న 'కల్లిపాడు'తో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ప్రధానంగా పద్నాలుగు జిల్లాల నుంచి శిష్యులు, కన్నమనీయులు, పిన్నమనీయులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆనాడు బ్రహ్మనాయుడు గుత్తికొండ బిలానికి వెళ్తూ యుద్ధంలో మరణించిన వీరులకు ఉత్సవాలు నిర్వహించడానికి వీరాచార పీఠం ఏర్పరిచి పిడుగు వంశీయులైన బ్రాహ్మణులను పీఠాధిపతులుగా నియమించారు. వంశపారపర్యంగా వస్తున్న ఈ పీఠాధిపత్యంతో ఈ ఉత్సవాలను యువకుడు పిడుగు తరుణ్ చెన్నకేశవ అయ్య వారు నిర్వహిస్తారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, పీఠం నిర్వాహకుడు విజయకుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు.


పల్నాటి వీరుల ఆయుధాలు


యుద్ధభూమిలో దక్షిణం వైపున నిర్మించిన వీరుల సేవా స్థలం

బీచ్‌వాలీబాల్ పోటీలలో.. గుంటూరు జిల్లా ప్రతిభ

బాపట్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సూర్యలంక తీరంలో రెండురోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి పాఠశాలల బీచ్‌వాలీబాల్ టోర్నమెంట్ సెలక్షన్స్ బుధవారంతో ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లాలు నుంచి అండర్-14,17,19 సంవత్సరాల బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఈపోటీలలో అండర్-19 బాలికల విభాగంలో కృష్ణాజిల్లా, విజయనగరం జిల్లాలు ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్-19 బాలుర విభాగంలో ఈస్ట్ గోదావరి ప్రథమస్థానం, కృష్ణాజిల్లా ద్వితీయ స్థానం, అండర్-17 బాలికల విభాగంలో కడప ప్రథమ స్థానం, గుంటూరు ద్వితీయ స్థానం, అండర్-17 బాలుర విభాగంలో గుంటూరు ప్రథమస్థానం, శ్రీకాకుళం ద్వితీయ స్థానం, అండర్ -14 బాలుర విభాగంలో గుంటూరు జిల్లా ప్రథమ స్థానం, కర్నూలు జిల్లా ద్వితీయ స్థానం, అండర్-14బాలికల విభాగంలో కడప ప్రథమస్థానం, గుంటూరు ద్వితీయ స్థానం సాధించాయి. గెలుపొందిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం, గుంటూరుజోన్ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరి ఎస్‌కె.కరిముల్లాలు బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రబీచ్ వాలీబాల్‌జట్లు ఇక్కడ ఎంపిక చేయటం జరిగింది. వీరు డిసెంబరు నెలలో జాతీయస్థాయి పోటీలు ఒరిస్సా రాష్ట్రంలోని పూరిలో జరుగు పోటీలలో పాల్గొంటారని సెక్రటరి ఎస్‌కె.కరిముల్లా తెలిపారు.


బీచ్‌వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, బహుమతులను అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం తదితరులు

ఏపీలో వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహించండి: ఎంపీ లావు

న్యూఢిల్లీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహించాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. బుధవారం వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలను ఆయన పార్లమెంట్ దృష్టికి తీసుకొచ్చారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పుట్టినిల్లు అయిన ఆంధ్రప్రదేశ్‌లో లోతైన వ్యవసాయ పరిశోధనలకు పెట్టుబడులు పెట్టాలని కేంద్రానికి ప్రతిపాదించారు. వ్యవసాయంలో వినూత్న పద్ధతులు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధిక దిగుబడి ఇస్తున్న పంటల్లో సూక్ష్మపోషక సాంద్రత గణనీయంగా తగ్గుతుందని తేలిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన పంట దిగుబడిని ప్రోత్సహించాలన్నారు.

యడ్లపాడు: దారి దోపిడీ దొంగలకు ఐదేళ్ల జైలు, జరిమానా

యడ్లపాడు, నరసరావుపేట లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల పరిధిలో దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగలకు ఐదేళ్ళు జైలు శిక్ష విధిస్తూ నరసరావుపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎ పూర్ణిమ బుధవారం తీర్పునిచ్చారు. ఎస్ఐ వి బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... 2021 డిసెంబరు 6న లింగారావుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మద్దు వీరయ్య, ప్రసన్న దంపతులు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న బంధువులను పరామర్శించి రాత్రి 8.30 గంటల సమయంలో గ్రామానికి వస్తుండగా బోయపాలెం-లింగారావుపాలెం మార్గంలోని చెరువు సమీపంలో గుర్తు తెలియని దుండగులు కర్రలతో దాడిచేసి వారివద్ద 3.5గ్రాముల బంగారం, రూ.2,300 నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కుని వదిలివేశారు. మరి కొంత సమయానికి అదే కాలనీకి చెందిన మద్దు అంకమ్మ, నర్సమ్మలు రాగా వారిపై కూడా దాడిచేసి సెల్‌ఫోన్, చెవి కమ్మలు, జూకాలు, గొలుసు లాక్కుని తీవ్రంగా కొట్టారు. సంఘటన జరిగిన మరుసటి రోజు రాత్రి 9 గంటల సమయంలో చెంఘీజ్‌ఖాన్‌పేట-సొలస మార్గంలో ద్విచక్రవాహనంపై కుమారుడు ధనుష్‌తో కలసి వెళుతున్న సాగి నాగమ్మలను ముసుగులు వేసుకున్న దుండగులు కర్రలతో దాడిచేసి పొలంలోకి లాక్కెళ్ళి వారి వద్ద ఉన్న 3.75 సవర్ల బంగారు గొలుసు చెవి పోగులు, ఉంగరం, వెండి పట్టీలు లాక్కున్నారు. కొద్ది సేపటికే అదే గ్రామానికి చెందిన పొనుగుబాటి వీరాంజనేయులు తాళ్లూరిలోని ఉంటున్న తన అత్త గోరంట్ల అంజమ్మను ద్విచక్రవాహనంపై తీసుకుని వస్తుండగా అతనిపై కూడా దాడిచేసిన దుండగులు సెల్‌ఫోన్, రూ.1,500 నగదు, అంజమ్మ వద్ద ఉన్న చెవి కమ్మలు, ముక్కుపుడక లాక్కున్నారు. అప్పట్లో ఈ సంఘటనలు సంచలనం కలిగించాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో నిందితులైన నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు గ్రామానికి చెందిన ఆకుల లింగమయ్య, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం అమ్మవరం గ్రామానికి చెందిన దాసరి ఓబులేసు, నంద్యాలకు చెందిన చిన్న ఇండ్ల రమణయ్యతో పాటు మరో ఐదుగురిని అరెస్టు చేశారు. వారిపై కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. బెయిల్‌పై వెళ్లిన వారిలో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారు. మిగతా ముగ్గురు నిందితులకు గతంలో ఓ కేసులో 20 సంవత్సరాలు శిక్ష పడింది. వారు ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైల్లో ఉన్నారు. వారిపైనే పై రెండు నేరాలు కూడా రుజువ్వడంతో ఒక్కొక్క కేసులో ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాలు శిక్ష మొత్తాన్ని ఏకకాలంలో అనుభవించేలా న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ బుచ్చిదంతాచారి నిర్వహించారు. దోపిడీలకు పాల్పడిన వారంతా వలస కూలీలుగా యడ్లపాడు మండలానికి వచ్చి పగలు పనులకు వెళ్ళేవారని, రాత్రిళ్ళు దోపిడీలకు పాల్పడే వారని ఎస్ఐ వివరించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రేణుకకు బంగారు పతకం

పోటాపోటీగా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలు


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు

పెదకాకాని, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న సౌత్ వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలో వర్సిటీ విద్యార్థిని రేణుక బంగారు పతకం సాధించింది. బుధవారం జరిగిన పోటీల్లో 76 కేజీల విభాగంలో మొత్తం 205 కేజీలు బరువు ఎత్తి రేణుక ప్రథమ స్థానంలో నిలిచినట్లు పోటీల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ వీపీఎస్ పాల్‌కుమార్ తెలిపారు. 71 కేజీల విభాగంలో ఆంధ్ర యూనివర్సిటీ క్రీడాకారిణి సనపత్తి పల్లవి బంగారు, ఏఎన్‌యూ విద్యార్థిని బి.నాని వెండి, మంగళూరు యూనివర్సిటీ క్రీడాకారిణి ఎం.తనుషా కాంస్య పతకాల్ని పొందారు. 64 కేజీల విభాగంలో భారతీ విద్యాపీఠ్ యూనివర్సిటీకి చెందిన కామ్ బ్లీ హిమాలినగేష్ బంగారు, శివాజీ యూనివర్సిటీ క్రీడాకారిణి మోహితే భూమిక రాజేంద్ర వెండి, అన్నామలై యూనివర్సిటీ విద్యార్థిని కౌశికల్ కాంస్య పతకాల్ని కైవసం చేసుకున్నారు. 59 కేజీల విభాగంలో భారతీ విద్యాపీఠ్ యూనివర్సిటీకి చెందిన క్రీడాకారిణి సాక్షిరమాలే బంగారు, భారతీయార్ యూనివర్సిటీ క్రీడాకారిణి కనికశ్రీ వి.ఆర్ వెండి, జేఎన్టీయూ కాకినాడ క్రీడాకారిణి కందుకూరి హైమావతి కాంస్య పతకాల్ని సాధించినట్లు పాల్ కుమార్ తెలిపారు. వర్సిటీ వీసీ, పోటీల నిర్వాహక కమిటీ ఛైర్మన్ ఆచార్య కే. గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం పతకాలు పొందిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ టీం చీఫ్ బడేటి వెంకట్రామయ్య, అధ్యాపకులు డాక్టర్ డి.సూర్యనారాయణ, డాక్టర్ యిన్నయ్య, డాక్టర్ రామ్మోహనరావు లు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌గా నంద

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయ విభాగంలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పర్చూరు కుమారి నంద సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకం సాధించారు. బుధవారం ఆమెను వీసీ ఆచార్య కె.గంగాధరరావు అభినందించారు. నేషనల్ ఈవెంట్‌లో కూడా రాణించి మరిన్ని పతకాలు సాధించాలని రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఆమెకి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవిభాగాధిపతి ప్రొఫెసర్ ఎల్. జయశ్రీ, అతిథి అధ్యాపకులు డాక్టర్ ఎస్.సతీష్, ఎస్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ పి.శివరాం, చెన్నారావు, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, అభిషేక్, డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎన్ రాధిక, డాక్టర్ కిషోర్, డాక్టర్ జి.సతీష్‌కుమార్, శ్రీరామ్ తదితరులు ఈ అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధే బరువాయే

నారు పోసిన వాడు నీరు పోయక పోతాడా అన్న ధీమా గుంటూరు ప్రభుత్వాసుపత్రి సిబ్బందిలో కనిపిస్తుంది. అసలే ప్రాణం ఉంటుందో పోతుందో అన్న బాధలో ఆసుపత్రికి వచ్చే వారికి అక్కడ మరిన్ని బాధలు తప్పడం లేదు. అయిన వారిని కాపాడుకునేందుకు రక్త సంబంధీకులే స్ట్రెచర్‌లను నెట్టుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రిలో చేరిన తరువాత కూడా ఆ పరీక్ష ఈ పరీక్ష అంటూ వార్డులకు తీసుకు వెళ్లేందుకు బంధువులే ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అక్కడ ఉన్న వార్డు బాయ్‌లు ఏమయ్యారో.. ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి.

-(గుంటూరు, ఆంధ్రజ్యోతి)



నేటి వరకే క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకారం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరి రివిజన్-2025లో భాగంగా సాధారణ ఓటర్లు తమ క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఈ నెల 28వ తేదీ సాయంత్రం వరకు దాఖలు చేయొచ్చని ఈఆర్‌వో ఎస్ఎస్‌కే కాజావలి తెలిపారు. గత నెల 29వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాని ప్రచురించడం జరిగిందని, ఆ రోజు నుంచే క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తున్నామ న్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కలిపి దాదాపుగా 15 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తున్నా మన్నారు. ఈ నెల 16, 17, 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోల ద్వారా స్పెషల్ క్యాంపెయిన్ డేలను కూడా నిర్వహించామని చెప్పారు. గురువారం సాయంత్రం వరకు దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబరు 24వ తేదీ లోపు పరిష్కరించి ఓటర్ల జాబితాను ఆరోగ్యవంతంగా రూపొందిస్తామని పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితా 2025 జనవరి 6వ తేదీన ప్రచురించడం జరుగుతుందన్నారు. దీని దృష్ట్యా ఇంకా ఎవరైనా క్లెయిమ్‌లు పెట్టుకోదలచిన వారు గురువారం సాయంత్రం లోపు దాఖలు చేసుకోవచ్చని సూచించారు. ఇది సాధారణ ఓటర్లకు సంబంధించిన ప్రక్రియ అని, దీనికి పట్టభద్రుల ఓటర్ల క్లెయిమ్‌లకు సంబంధం లేదన్నారు.

అడుగడుగునా.. వసూళ్లు

మిర్చి ఎగుమతిదారులు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)కు ప్రత్యామ్నాయం చూసుకొంటున్నారు. హమాలీలు మొదలుకొని లారీ యజమానుల వరకు సిండికేట్లుగా మారి అలవికాని ఛార్జీలు వసూలు చేస్తుండటమే ఇందుకు మూల కారణం. ఇప్పటికే కొంతమంది ఎక్స్‌పోర్టర్లు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం మార్కెట్‌కి వెళ్లి అక్కడ మిర్చిని కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు. మరికొందరు పల్నాడు జిల్లాలోని దాచేపల్లి ఏఎంసీకి వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. దీని వలన ఇప్పటికిప్పుడు మార్కెట్ కమిటీ ఆదాయంలో వ్యత్యాసం పెద్దగా కనిపించకపోయినా దీర్ఘకాలంలో భారీగానే రాబడికి చిల్లు పడుతుందన్న అభిప్రాయం వ్యకమవుతున్నది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు తేరుకోకపోతే ఆ తర్వాత చర్యలు తీసుకొన్నా ఎలాంటి ఉపయోగం ఉండదు.

- మిర్చి ఎగుమతిదారుల పక్కచూపులు
- గుంటూరు యార్డులో సిండికేట్‌లతో వేగలేకే ప్రత్యామ్నాయం
- ఖమ్మం, దాచేపల్లి యార్డుల్లో కొనుగోళ్లపై ఆసక్తి
- ఇదే పరిస్థితి కొనసాగితే జీఏంసీ ఆదాయానికి గండి పడినట్లే

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): మిర్చి ఎక్స్‌పోర్టింగ్‌కు మిర్చియార్డు పెట్టింది పేరు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా మిర్చి పండికే కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి కూడా రైతులు ఇక్కడికే వస్తుంటారు. ఇందుకు కారణం సరుకు అమ్ముడవగానే పైకం చేతిలో పడుతుంది. గతంలో పెద్దగా కూలీ ఛార్జీలు లేకపోవడం వలన ధర కూడా రైతుకు గిట్టుబాటు అయ్యేది. అయితే కాలక్రమంలో ఇక్కడ ప్రతీ వ్యవస్థలో సిండికేట్లు పుట్టుకొచ్చాయి. దొడ్డి కాపలా, కాటాలు, మచ్చు, లారీలోకి టిక్కీలు లోడింగ్ చేసి మోకులు కట్టినందుకు మరే ఇతర మార్కెట్లలో లేని ఛార్జీలను ఇక్కడ వసూలు చేస్తున్నారు. ఇవి చాలదన్నట్లుగా గుమాస్తా మామూళ్లు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ రైతు తీసుకొచ్చిన మిర్చికి ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేయకుండా ఎగుమతిదారులకు ప్రతిబంధకాలుగా మారాయి. ఇక లారీ రవాణ ఛార్జీలు కూడా ఇతర ప్రాంతాలతో పోల్చితే చాలా ఎక్కువ. ఒక మిర్చి టిక్కీ కాటా వేసినందుకు దాదాపుగా రూ. 5కి ఛార్జీ పెంచమని వేమెన్‌ల సిండికేట్ కోరుతున్నది. లారీకి మిర్చి టిక్కీలు ఎత్తి మోకులు కట్టినందుకు దాదాపుగా రూ. 6 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. అయితే ఈ పనిని సక్రమంగా చేయడం లేదు. లారీ హైవే మీదకు వెళ్లిన తర్వాత అక్కడ తిరిగి మోకులను బిగించాల్సి వస్తున్నది. ఇందుకు దాదాపుగా రూ. 1500లకు పైగా ఖర్చు అవుతున్నది.

దొడ్డి కాపలా, దిగుమతి, ఎగుమతి కూలీలు కూడా మోయలేని భారంగా మారాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మచ్చుకాయల రూపంలో ఒక్కో లాట్ నుంచి కేజీకి పైగానే మిరపకాయలను తీసుకొంటున్నారు. ఒక లారీ ఎక్స్‌పోర్టింగ్‌కు పెడితే ఎగుమతిదారుడి గుమాస్తా మామూలు కింద రూ. 3 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. ఇవ్వకపోతే బిల్లులు కొట్టకుండా జాప్యం చేస్తున్నారు. అలానే మిర్చియార్డులో సూపర్‌వైజర్ల మామూళ్లు బహిరంగ రహస్యమే. ఇలా చూసుకొంటే సిండికేట్ల కారణంగా ఒక లారీని ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తే ఇతర మార్కెట్లతో పోల్చితే దాదాపుగా రూ. 30 వేలకు పైగా వ్యత్యాసం వస్తున్నదని ఎక్స్‌పోర్టర్స్ చెబుతున్నారు. దీని వలనే తాము ఖమ్మం, దాచేపల్లి మార్కెట్ కమిటీల్లో మిర్చి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. దాచేపల్లి ఏఎంసీ నుంచే ఈ ఏడాది 6 లక్షలకు పైగా మిర్చి టిక్కీలు ఎగుమతి అయినట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ఖమ్మం మార్కెట్ నుంచి 20 లక్షలకు పైగా టిక్కీలు ఎగుమతి అయ్యాయని తెలిపాయి. దీనివలన గుంటూరు యార్డుకు రావాల్సిన ఆదాయానికి క్రమక్రమంగా గండి పడటం ప్రారంభించింది. ఈ కారణంగానే మిర్చియార్డు ఆదాయం ఏటా రూ. 100 కోట్ల మార్కెట్ ఫీజుకు మించడం లేదు. వాస్తవానికి ఇంతకంటే కనీసం మరో 40 శాతం పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా సిండికేట్ల కారణంగా గండి పడుతున్నది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు మిర్చి ఎగుమతులకు అనుకూలమైన వాతావరణం కల్పించకపోతే పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇవేకాకుండా కొంతమంది కమీషన్ వ్యాపారస్తులు ఎగుమతిదారులకు నమ్మకంగా కుచ్చుటోపీ పెడుతుండటంతో ఈ మోసాలతో వేగలేమని వేరేదారులు వెతుక్కొంటున్నారు.



గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

మంగళగిరి సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ, ఆత్మకూరు, చినకాకాని, పెదవడ్లపూడి, రామచంద్రాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఏ-గ్రేడ్ వరి మద్దతు ధర 75 కిలోల బస్తాకు రూ.1740 చొప్పున ప్రభుత్వమే నేరుగా సివిల్ సప్లయిస్, జీడీసీఎంఎస్ ఏజెన్సీ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు నేరుగా రైతుల పొలంలో కోత సమయంలో తేమ శాతాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోలు చేస్తారని చెప్పారు. తేమ శాతం 17 నుంచి 24 వరకు ఉన్నా కొనుగోలు చేస్తారన్నారు. గోతాలు మంగళగిరి మార్కెట్ యార్డులో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మున్సిపల్ హైస్కూల్‌కు ఎస్‌బీఐ వితరణ



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎస్‌బీఐ ప్రతినిధులు

మంగళగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మంగళగిరి శాఖ తరపున సుమారు రూ.5 లక్షల విలువైన వస్తువులను అందజేశారు. రెండు కంప్యూటర్లు, ప్రింటర్, 41బెంచీలు, విద్యాకమిటీ సమావేశాల నిర్వహణ నిమిత్తం 50 ప్లాస్టిక్ కుర్చీలు, రెండు కంప్యూటర్ టేబుళ్లు, కుర్చీలను బహూకరించారు. చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ శైలేష్ కుమార్, డీజీఎం కృష్ణకుమార్, మంగళగిరి మేనేజరు నరేంద్ర, ప్రధానోపాధ్యాయుడు సంగినేని శ్రీనివాసరావు, పిన్నింటి మాధవి, విద్యా కమిటీ ఛైర్మన్ హనుమాన్, వైస్ ఛైర్మన్ చెన్నకేశ్వరమ్మ, వేణుగోపాలరావు, విశ్రాంత హెచ్‌ఎం గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక మాసం పూజలు



అయ్యప్పస్వామి ఆలయంలో ఓంకారం, నామాలు,స్వస్తి ఆకారంలో వెలుగుతున్న దీపాలు

తుళ్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భక్తిశ్రద్ధలతో కార్తీక మాసం పూజలు కొనసాగుతున్నాయి. అన్ని దేవాలయాల్లో విశిష్ట పూజలు నిర్వహించి దీపారాధనలు నిర్వహిస్తున్నారు. ఈనెల 30తో కార్తీక మాసం ముగియనుంది. తుళ్లూరు అయ్యప్ప స్వామి ఆలయంలో మాలధారణ స్వాములు ఓంకారం, స్వస్తి, లింగాకారంలో దీపాలు వెలిగించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శివనామ అర్ధ ఏకాహం



భక్తులకు అన్న సంతర్పణ చేస్తున్న రమేష్, అనిత

మంగళగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శివ భక్త బృందం ఆధ్వర్యాన మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శివనామ అర్ధ ఏకాహం నిర్వహించారు. అర్ధ ఏకాహంలో భజనలు, సంకీర్తనలను ఆలపించిన భక్త బృందాలను మంగళగిరి మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ మన్నెం రమేష్‌బాబు, అనిత దంపతులు ఘనంగా సత్కరించారు. గత 25 సంవత్సరాల నుంచి శివ భక్త బృందం ఆధ్వర్యాన కార్తీక మాసంలో శివనామ ఏకాహం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో శివాలయం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ బోగి కోటేశ్వరరావు, అర్చకస్వామి తెలిదేవరపల్లి శ్యామసుందర శాస్త్రి, భక్త బృందం ప్రతినిధులు వంకం నాగమయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి

పెదనందిపాడు, నవంబరు, 27 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి అన్నారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, సీడీపీవో సుజాతాదేవి, ఏవో స్వామిరెడ్డి, సూపర్‌వైజర్ వై.రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం వద్దు

బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు

వట్టిచెరుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవ ఎరువులను వినియోగించటం ద్వారా నాణ్యమైన ఉత్పత్తితో పాటు అధిక దిగుబడులు సాధించుకోవచ్చునని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. వట్టిచెరుకూరు గ్రామంలో ఎద పద్ధతిలో వరి సాగును తొలి నుంచి పర్యవేక్షిస్తు న్న పొలాన్ని విద్యార్థులు బుధవారం రైతులకు ప్రత్యక్షంగా చూపించా రు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతులకు ద్రవ జీవామృతం తయారు చేసే విధానం, దాని వల్ల ఉపయోగాలను వివరిస్తూ జీవామృతం అన్ని పంటలకు ఉప యోగించ వచ్చని వారు వివరించారు.

710 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి), నవంబరు 27: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 710 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,100, గరిష్ఠ ధర రూ.11,280, మోడల్ ధర రూ.11,280 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,100, గరిష్ఠ ధర రూ.11,280 మోడల్ ధర రూ.11,280 పలికాయి.

రైతుల అంగీకారంతోనే భూములు తీసుకోవాలి

● మంత్రి నారాయణతో తాడికొండ రైతులు



మంత్రి నారాయణకు రైతులతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నూతన రైల్వే లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టుల నిర్మాణానికి రైతుల అంగీకారంతోనే భూములు తీసుకోవాలని మంత్రి నారాయణతో తాడికొండ రైతులు స్పష్టం చేశారు. రైల్వే లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుల్లో భూములు కోల్పోతున్న రైతులతో కలిసి ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ బుధవారం మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాడికొండ, మోతడక, కంతేరు గ్రామాల నుంచి రైల్వే లైన్ వెళ్తుతుందని, ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ ప్రకటించిందని తెలిపారు. రైతుల అభిప్రాయాలు సేకరించకుండా, రైతుల అంగీకారం తెలియజేయకుండా, రైతులకు పరిహారం ప్రకటించకుండా రైతుల భూముల్లో రైల్వే అధికారులు పెగ్‌మార్కులు వేశారన్నారు. భూసేకరణ కాకుండా భూసమీకరణ చేసి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. రైల్వేలైన్‌కు ఇరువైపుల సర్వీస్ రోడ్లు తప్పనిసరిగా వేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాజధాని అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులకు తాడికొండ రైతులు వ్యతిరేకం కాదని అన్నారు. రైతులకు తగిన న్యాయం చేయాలన్నారు. రైల్వే లైన్ నిర్మాణం వల్ల పంటలు పండే భూములు నిరుపయోగమవుతాయని తెలిపారు. అంతేకాకుండా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాడికొండ గ్రామంలో రోడ్ల విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం ఇంతవరకు ఇవ్వలేదని, బాధితులకు పరిహారం ఇచ్చేలా చూడాలని నారాయణకు తెలియజేశారు. మంత్రి మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తుందన్నారు. అధికారుల ద్వారా భూ సమీకరణలో తలెత్తిన సమస్యలను పరిశీలించి, వీలైనంత త్వరగా రైతులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు దృష్టికి రైతుల సమస్యలను తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా రైతుల అభిప్రాయాలు, అంగీకారం తప్పనిసరిగా తీసుకుంటామన్నారు. మంత్రి నారాయణను కలిసిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, గుంటుపల్లి మధుసూదనరావు, యడ్లపల్లి సాంబ శివరావు, గడ్డిపాటి సాంబశివరావు, దంటు శ్రీనివాసరెడ్డి, దంటు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

● పాండ్రపాడులో అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన
● కొల్లిమర్లలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన
● కాకుమానులో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్



పంట కుంట పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ సంజన సింహ తదితరులు

కాకుమాను, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీకే పాలెం, పాండ్రపాడు, కొల్లిమర్ల, కాకుమాను గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహాతో కలసి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత మండల పరిధిలోని బీకే పాలెంలో శ్రీనివాసరావు అనే రైతు వ్యవసాయ పొలంలో నిర్మించుకుంటున్న పంట కుంటకు శంకుస్థాపన చేశారు. మండలంలో రెండు పంట కుంటలు మంజూరు కాగా ఎన్‌ఆర్‌జీఈఎస్ నిధులతో రూ.57 వేల వ్యయంతో నిర్మిస్తున్న పంట కుంటలకు కలెక్టర్ భూమిపూజ చేశారు. అనంతరం కొల్లిమర్లలో గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు రూ.9 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. కొల్లిమర్ల గ్రామ మాజీ సర్పంచ్ రామకోటేశ్వరావు, పెద్ది రవీంద్ర బాబు గ్రామంలో తాగునీటి కష్టాలను కలెక్టర్ నాగలక్ష్మికి తెలిపారు. స్పందించిన కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ గ్రిడ్ పథకం చేస్తున్నారని, కృష్ణా నీటిని తీసుకువచ్చి కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు పక్కనే ధాన్యం రాశులను పరిశీలించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ధాన్యాన్ని విక్రయించుకుని కనీస మద్ధతు ధర పొందాలని రైతులకు సూచించారు.

పాండ్రపాడులో అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

పాండ్రపాడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థుల హాజరు, ప్రభుత్వం వారికి అందిస్తున్న ఆహారం, శిక్షణ తదితర పథకాల గురించి వాకబు చేశారు. నూతనంగా నిర్మించిన టాయిలెట్‌లను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, ఎత్తు, బరువుల నమోదు చేస్తున్న రిజిష్టర్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులకు సులభతర విద్యాబోధన చేయాలని అంగన్‌వాడీలకు సూచించారు.

గురుకుల బాలికల పాఠశాల తనిఖీ

పొన్నూరు-కాకుమాను ప్రధాన రహదారి వెంట ఉన్న బాలయోగి గురుకుల బాలికల పాఠశాల, హాస్టల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో 437 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మజరమ కలెక్టర్‌కు వివరించారు. హాస్టల్‌లో వంట గది, స్టోర్ రూమ్, పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని తిని నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో నీటి సమస్య పరిష్కారానికి జడ్పీ నిధులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, మిగిలిన పనులకు అంచనాలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. విద్యార్థులు వాడుకునే నీటిని కలుషితం లేకుండా మైక్రో ఫిల్టర్ ద్వారా ఆర్వో ప్లాంట్‌కు నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శంకర్, స్పెషల్ ఆఫీసర్ జగన్మోహన్‌రావు, జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్బార్‌బేగం, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో యుగకీర్తి, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



సైడ్ డ్రైయిన్ నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. నిడుముక్కల గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఓబురాయి చెరువు వరకు సైడ్ కాల్వను విస్తరించి, డ్రెయిన్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.30 లక్షల వ్యయంతో డ్రెయిన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎన్‌ఆర్‌జీఎస్ నిధుల ద్వారా సిమెంట్ రోడ్లు వేస్తున్నారన్నారు. గుంతలు లేని రహదారులు ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ రహదారులకు మరమ్మతులు చేస్తుందన్నారు. రానున్న బడ్జెట్‌లో ఆర్‌అండ్‌బీ రహదారులు కొత్తవి వేయటానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో పంచాయతీ నిధులు దారి మళ్లించి గ్రామాల అభివృద్ధి గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీలు అభివృద్ధిపై పయనిస్తున్నాయన్నారు. ఉద్యోగ మేళాలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నామన్నారు. అనంతరం ఇటీవల మరణించిన పాడి రైతు గడ్డిపాటి అప్పారావు కుటుంబానికి సంగం డెయిరీ ఇన్సూరెన్స్ రూ.50 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, సర్పంచ్ మాదాసు రత్నకుమారి, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చిగురుపాటి అనూప్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండ్ల శ్రీకాంత్, ఎంపీడీవో సమతవాణి, తహసీల్దార్ కే.నాసరయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను మంత్రి నారా లోకేశ్ స్థానిక టీడీపీ నేతల ద్వారా బుధవారం అందజేయించారు. గండాలయపేటకు చెందిన కోట మహేష్‌కు రూ.80 వేలు, మంగళగిరికి చెందిన మహమ్మద్ ఇబ్రహీంకు రూ.26,626, 18వ వార్డుకు చెందిన టిప్పాబత్తుని చిన్నికృష్ణకు రూ.46,500, వీవర్స్ కాలనీకి చెందిన చింతలపూడి లక్ష్మీకి రూ.28,800, షరాబ్ బజారుకు చెందిన అవ్వారు సాంబశివరావుకు రూ.48,541 చొప్పున మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను టీడీపీ నేతలు అబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ మాట్లాడుతూ మంత్రి లోకేశ్ చొరవతో నియోజకవర్గంలో ఎంతో మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందుతుందని చెప్పారు. .

రేవేంద్రపాడులో..

దుగ్గిరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతోనూ, ప్రమాదాల బారిన పడి ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స చేయించుకున్న బాధితుల ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి సహాయనిధి నగదు చెక్కులను బుధవారం అందించారు. రేవేంద్రపాడుకు చెందిన శృంగారపాటి సుజాతకు రూ.84వేలు, మోరంపూడికి చెంది న బత్తుల గోపీచంద్‌కు రూ.25 వేలు, పెదపాలేనికి చెందిన యలవర్తి హనుమంతరావుకు రూ.85 వేలు, దుగ్గిరాలకు చెందిన చిలకా దిలీప్‌కు రూ.3 లక్షల 55 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణ ప్రసాద్, సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్ర సాద్, ఎంపీటీసీ కొప్పుల మధుబాబు, కాసరనేని జస్వంత్, జే.భుజంగరావు, దేవరపల్లి చంటి, ఇంటూరు శ్రీను, గొరిగపూడి సత్యనారాయణ, నంబూరు యాకోబు, పర్వతనేని హర్ష, పుతుంబాక మనోహర్, జంపాల హరిప్రసాద్, కేసంనేని వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

30న కేఎల్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం

● ముఖ్య అతిథిగా మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్
● గౌరవ అతిథులుగా గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



స్నాతకోత్సవ ఆహ్వానాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ సారధివర్మ

తాడేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం ఈనెల 30న యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు వీసీ సారధివర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ విచ్చేసి స్నాతకోత్సవ ఉపన్యాసం చేస్తారని చెప్పారు. రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తదితర ప్రముఖులు గౌరవ అతిథిలుగా పాల్గొంటున్నారని చెప్పారు. 2024 విద్యాసంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 4706 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే గత విద్యాసంవత్సరంలో అత్యంత ప్రతిభ కనబరిచిన 42 మంది విద్యార్థులకు బంగారు, 37 మందికి రజత పతకాలు, నగదు అందించనున్నట్లు తెలిపారు. దేశ, విదేశాల్లో రూ.57 లక్షల జీతాలతో ఉద్యోగాలు సాధించి చరిత్ర సృష్టించారన్నారు. రిజిస్ట్రార్ కె.సుబ్బారావు మాట్లాడుతూ డిగ్రీలు తీసుకునే విద్యార్థులందరికి ఇప్పటికే సమాచారం అందించామని 30వ తేదీ ఉదయం 9 గంటలకల్లా యూనివర్సిటీ వేదిక వద్దకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ అధ్యక్షత వహిస్తుండగా సంధానకర్తగా కె.సుబ్బారావు వ్యవహరిస్తారని తెలిపారు.

మా వీవోకు మాత్రమే ఎందుకు సమాచారం ఇవ్వడం లేదు

● మండల సమాఖ్య సమావేశంలో ప్రశ్నించిన డ్వాక్రా సభ్యురాలు

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య సమావేశానికి మాకెందుకు సమాచారం ఇవ్వలేదంటూ గొట్టిపాడు రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘం సభ్యురాలు శివకుమారి ఏపీఎంతో పాటు మండల సమాఖ్య అధ్యక్షురాలిని ఘాటుగా ప్రశ్నించారు. బుధవారం ప్రత్తిపాడు మండలపరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గొట్టిపాడుకు చెందిన రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘం వీవోఏకు సమాచారం ఇవ్వలేదు. దీనిపై తొలుత ఏపీఎంను ఫోన్‌లో ప్రశ్నించగా సీసీని అడగమనడంతో వెంటనే సీసీకి ఫోన్ చేయగా మరో వీవోఏ అనురాధను అడిగి చెపుతాను అని చెప్పారు. దీనిపై ఆగ్రహించిన ఆ వీవోఏ అధ్యక్షురాలు కే రజని తోపాటు సభ్యురాలు శివకుమారిలు సమావేశానికి వచ్చి ఏపీఎంను ఘాటుగా ప్రశ్నించారు. మా వీవోఏకు ఎలాంటి అవినీతి మరకలు లేవని, ఎందుకని గ్రూపు నుంచి తొలగించారు.. సర్వే లింకు కూడా ఇవ్వకుండా ఉన్నారంటూ ప్రశ్నించారు. మీరు ఇష్టమొచ్చినట్లు చేస్తుంటే ఊరుకోమని ఎంత దూరమైనా వెళతామంటూ హెచ్చరించారు. డ్వాక్రా సభ్యురాలు అడిగే ప్రశ్నలకు ఏపీఎం గాని సీసీ గాని ఎలాంటి సమాధానం చెప్పలేక మౌనం వహించాల్సి వచ్చింది.

విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన

దుగ్గిరాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల గ్రామం చింతలపూడిలోని ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు నమోదుపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఐ.సునీత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, దేశ పౌరులుగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటు నమోదు కార్యక్రమం చేపట్టారన్నారు. గ్రామాల్లోనూ పోలింగ్‌స్టేషన్‌ల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● మంత్రి సవితకు చేనేత కార్మిక సంఘం నేతల వినతి



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

తాడేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు, పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్ సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోవడంలేదని తెలిపారు. సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావలసిన రూ.172 కోట్లు గత ఆరు సంవత్సరాల నుంచి విడుదల కాలేదని మంత్రి సవిత దృష్టికి తీసుకువెళ్లారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో పాల వెంకట సుబ్బారావు, భార్య, కుమార్తెలు ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించి, కబ్జాకు గురైన 5 ఎకరాల సాగుభూమిని వారి చిన్న కుమార్తెకు అప్పగించాలని కోరారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, చేనేత నేస్తాన్ని రూ.24 వేల నుంచి రూ.36 వేలకు పెంచి కార్మికులందరికీ వర్తింపజేయాలని, నెలకు రూ.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నేతలు గొట్టుముక్కల బాలాజీ, నందం బ్రహ్మేశ్వరరావు, బత్తూరి మోహన్‌రావు, దొడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంగరాజు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఈఆర్వో గంగరాజు

తాడికొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తాడికొండ ఎన్నికల అధికారి, డిప్యూటి కలెక్టర్ జీ.గంగరాజు అన్నారు. బుధవారం లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా గంగరాజు మాట్లాడుతూ జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. విద్యార్థులకు ఓటర్ హెల్ప్‌లైన్, ఎన్‌వీఎస్‌పీ పోర్టల్ యాప్‌లలో ఫారం-6 అప్లై చేసుకోవచ్చన్నారు. ఓటు హక్కు ద్వారా మంచి సమాజాన్ని నిర్మించే వారిని ఎన్నుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే.నాసరయ్య, ఎన్నికల డీటీ మోహిని కుమారి, సీఎస్‌డీటీ దేవరాజు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ నల్హా, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు, వీఆర్‌వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రుణాల్లో మోసాలను అరికట్టేందుకు చర్యలు

● ఎస్‌ఎల్‌బీసీ సీనియర్ మేనేజర్ గౌతమ్

తాడేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని, ఆన్‌లైన్ ద్వారా రుణాల్లో జరుగుతున్న మోసాలు అరికట్టే పద్ధతులకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎస్‌ఎల్‌బీసీ సీనియర్ మేనేజర్ గౌతమ్ అన్నారు. బుధవారం వడ్డేశ్వరం మోటూరి ఉదయం భవన్‌లో స్వయం సహాయక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సదస్సుకు సీహెచ్ రమణి అధ్యక్షత వహించారు. గౌతమ్ మాట్లాడుతూ బ్యాంకులు, పొదుపు గ్రూపు సభ్యులకు అవసరమైన రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఎవరికి ఎలాంటి కమిషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా డిమాండ్ చేస్తే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం గ్రూపు సభ్యులందరూ ఐక్యంగా ఉండి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసకుమారి, శ్రీదేవి, పూర్ణ, సత్యవతి, పద్మ, అమలశ్రీ, పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా జంగాల పుట్టినరోజు వేడుకలు

తాడేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో టిడిపి సీనియర్ నాయకులు జంగాల సాంబశివరావు పుట్టినరోజు సందర్భంగా టీడీపీ నేత, లింగంశెట్టి అసోసియేట్స్ ప్రతినిధి లింగంశెట్టి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఉండవల్లి సెంటర్‌లో వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. 30 మంది రిక్షా కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి ఎంపీయూపీ పాఠశాలకు జంగాల వెంకటేష్ 56 కుర్చీలు వితరణగా అందజేసి పిల్లలతో కేక్ కట్ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో తెనాలి డిప్యూటి డీఈవో శాంతకుమారి, టీడీపీ, జనసేన నేతలు లింగంశెట్టి కిషోర్‌కుమార్, దొప్పలపూడి జ్యోతిబసు, లీలాకృష్ణ, దాసరి కృష్ణ, సనకా బుచ్చిబాబు, రమేష్, గాదె బసివిరెడ్డి, శిగిరిశెట్టి రాజా రమేష్, వాసుదేవరావు, గోపాలం కొండలరావు, అడపా నరేష్, బుల్లి కోటేశ్వరరావు తదితర నేతలు పాల్గొన్నారు.

పొలాల్లో కుంటలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలి

● ఎంపీడీవో లక్ష్మీదేవి

పెదనందిపాడు, నవంబరు, 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు పొలాల్లో రైతు వారి కుంటలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఫీల్డు అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో రానున్న ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా వ్యవసాయ ఆధారిత పనులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు పొలాల్లో నీటి కుంటలను తవ్వుకునే వెసులుబాటు కల్పిస్తుందని, రైతులు దీనిని సద్వినియోగించుకోవాలని తెలిపారు. పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

తెనాలి క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం పట్టణంలోని మారీసుపేట, పినపాడు, మధ్య ఉన్న రైల్వే గేటును గురువారం నుంచి డిసెంబరు 4, 5 తేదీల వరకు మూసివేయడం జరుగుతుందని ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు గమనించుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు.



భార్యను హింసిస్తున్న భర్తపై కేసు నమోదు

తెనాలి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్యను హింసిస్తున్న భర్తపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. ఐతానగర్‌కు చెందిన మమత అనే మహిళకు తాడేపల్లికి చెందిన శ్యాంసుందర్‌కు వివాహమైంది. వారికి ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. ఆర్మీలో పనిచేసిన వచ్చిన శ్యాంసుందర్ ఐతానగర్‌లో నివశిస్తున్నారు. మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను హింసిస్తున్నాడని బుధవారం మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాబురావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

తెనాలి క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాజరుపేటలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న వ్యక్తితో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. స్థానిక నాజరుపేటలో ఓ గృహంలో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారంతో బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించగా ఇద్దరు విటులు, ఇద్దరు వేశ్యలతో పాటు నిర్వాహకుడిని కూడా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

తెనాలి క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ ప్రాంతంలో టీ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్న ఎస్.రాధ అనే మహిళపై అదే ప్రాంతానికి చెందిన షేక్ కరీమ్ దాడిచేసి టీ బండిని ధ్వంసం చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

తెనాలి మారీసుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిమ్మతోటల్లో పేకాట ఆడుతున్నారని అందిన పక్కా సమాచారంతో దాడులు నిర్వహించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని అంగలకుదురు శివారుతోటల్లో బుధవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించగా అక్కడ పేకాడుతున్న ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.24వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించాలి: ఆర్జేడీ

పొన్నూరు టౌన్, నవంబరు 27: విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాన్ని పెంపొందించాలని విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ బి లింగేశ్వర రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ములుకుదరు ఎంపీయూపీ పాఠశాలను బుధవారం ఆర్జేడీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల తెలుగు, హిందీ పాఠ్యాంశాలపై ప్రతిభను పరీక్షించారు. అనంతరం గణిత పాఠ్యాంశంపై విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి మాలతీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రయోగపూర్వకంగా పాఠ్యాంశాలు నేర్చుకోవాలి: హెచ్ఎం

చేబ్రోలు, నవంబరు 27: విద్యార్థులు ప్రయోగపూర్వకంగా పాఠ్యాంశాలు నేర్చుకుంటే ఉత్తమ ఫలితాలు వస్తాయని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు బుధవారం వడ్లమూడి సంగం డెయిరీని సందర్శించారు. ఈ సందర్భంగా పాల సేకరణ నుంచి, పాల పదార్థాల తయారీ రవాణా, మార్కెటింగ్ వంటి అంశాలపై విద్యార్థులు సంగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పంచదార అభిషేకంలో సహస్రలింగేశ్వర స్వామి

భక్తి శ్రద్ధలతో లింగాభిషేకం

పొన్నూరు టౌన్, నవంబరు 27: పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం సహస్రలింగేశ్వర స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అలాగే స్వామి వారికి ప్రీతికరమైన విభూది, పంచదారతో అభిషేకాలు చేశారు. అనంతరం అభిషేక పదార్థాలను భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న గార్బేజ్ ప్రాంతం, తుప్పు పట్టిన గేట్లు, గడ్డలుగా మారిన సిమెంటు కట్టలు

వ్యర్థాలన్నీ రోడ్లపైనే

- నిలిచిపోయిన గార్బేజ్ నిర్మాణం ● చెత్తతో నిండిపోతున్న రోడ్లు
- భూములు కలుషితవుతున్నాయని రైతుల ఆవేదన
- మున్సిపల్ అధికారుల పనితీరుపై స్థానికుల ఆగ్రహం



చెత్త గుట్టలతో నిండిన రోడ్డు

తెనాలి, మారీసుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘం అనాలోచిత పనులతో వ్యర్థాలన్నీ రోడ్లపైకి చేరుతున్నాయి. స్థానిక పినపాడు యడ్లపాడు వెళ్లే రోడ్డులో చెరువు సమీపంలో గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ (జీటీఎస్) నిర్మాణానికి గతంలో పనులు ప్రారంభించారు. సుమారు రూ.72 లక్షలతో 2021వ సంవత్సరంలో పనులను ప్రారంభించారు. అందులో చేసిన పనులకు రూ.32.50లక్షలు చెల్లింపులు జరిగాయి. మున్సిపల్ అధికారుల ప్రణాళికల ప్రకారం టెండరుదారుడు సంవత్సరంలోపు నిర్మాణ పనులను పూర్తిచేసి అందించాల్సి ఉండగా వివిధ కారణాలతో పనులు నిలిచిపోయాయి. దానికి సంబంధించి చుట్టూ ప్రహరీ నిర్మించి అక్కడ రెండు గదులు, రాకపోకలు సాగించేందుకు గేట్లు ఏర్పాటు చేశారు. పట్టణంలో సేకరించిన చెత్తను అక్కడికి తరలించి తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేరుచేసి వివిధ ప్రాంతాలకు వాటిని తరలించి వీటిద్వారా సంపద సృష్టించవచ్చు. ఇంకా అవసరమైన కొన్ని పనులు చేపట్టాల్సి ఉండగా వాటిని మధ్యలోనే వదలి వేయడంతో పట్టణం నుంచి సేకరించిన చెత్త రోడ్లపైకి చేరుతోంది. జీటీఎస్ నిర్మాణ పనుల్లో వాడిన ఇనుముకు తుప్పు పడుతుండగా, సిమెంటు కట్టలు గడ్డలుగా మారిపోయాయి. ఆ ప్రాంతం లోపల మోకాలి ఎత్తులో పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తూ విషసర్పాలకు నిలయంగా, భయానకంగా మారింది. పినపాడు రోడ్డు నుంచి గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌కి చేరేందుకు రోడ్డు మార్గం కూడా వ్యర్థాలతో మూసుకుపోయింది. రూ.లక్షల రూపాయలతో వ్యర్థాల నిర్వహణకు ఏర్పాటుచేస్తున్న గార్బేజ్ స్టేషన్ నిరుపయోగంగా మారడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందంటూ ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పట్టణంలో బుర్రిపాలెం రోడ్డులో ప్రధాన డంపింగ్ యార్డు వ్యర్థాలతో నిండిపోవడంతో చెత్తను పినపాడు రోడ్డులోకి తరలిస్తున్నారు. రోజుల తరబడి చెత్తను రోడ్లపై తరలిస్తుండటంతో ఆ ప్రాంతమంతా కలుషితమవుతూ పక్కనే ఉన్న పంట పొలాలలో ఆ వ్యర్థాలు చేరి తమ పంట భూములు బీడు భూములుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీటీఎస్ పనులు అనుకున్న సమయానికి పూర్తయిఉంటే ఆ చెత్తతో సంపద సృష్టించి నిర్మాణానికి అయిన వ్యయంలో కొంతభాగం సమకూరి ఉండేది. జీటీఎస్‌ను నిరుపయోగంగా మార్చడంతో ప్రజాధనం వృథా అవుతుండటమే కాకుండా, వ్యర్థాలు రోడ్లపై చేరి వాతావరణ కాలుష్యంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గార్బేజ్ స్టేషన్ పనులపై దృష్టి పెట్టి పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని రోడ్లపై వేసిన చెత్తను తొలగించి సురక్షిత చర్యలు చేపట్టాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘ సభ్యులు, పలుసేవా సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు విషయంలో ప్రజల్లో మంచి స్పందన కనిపిస్తోందని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర టీడీపీ కార్యాలయంలో నాయకులతో ఆయన సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు. సభ్యత్వ నమోదు గురించి నాయకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం దగ్గర నుంచి ప్రతి రెండు సంవత్సరాల కొకసారి సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. సభ్యత్వ నమోదు అనంతరం గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి, రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవటం జరుగుతుందన్నారు. పార్టీలో భాగంగా సభ్యత్వ నమోదు ప్రాధాన్యమైనదన్నారు. యువ నాయకుడు లోకేశ్ ఆలోచన మేరకు రాష్ట్రంలో కోటి మందితో సభ్యత్వ నమోదుకు కార్యక్రమానికి నాంది పలికినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి

దీనిలో భాగంగా ఇప్పటికే 52లక్షల మంది సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. సభ్యత్వం ప్రారంభంలోనే మంచి స్పందన కనిపించినట్లు తెలిపారు. ఇంకా సభ్యత్వ నమోదుకు 20రోజుల సమయం ఉందన్నారు. సభ్యత్వం ప్రాంభంలోనే ఒక ఆలోచన చేయడం జరిగిందని ఎవరైతే శాశ్వత సభ్యత్వాన్ని చేయాలని అనుకుంటున్నారో వారు లక్ష రూపాయలు కట్టి శాశ్వత సభ్యుడుగా కొనసాగవచ్చునన్నారు. తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలంలో భీమవరపు లంకకోటిరెడ్డి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం కోసమే సభ్యత్వ నమోదు ముఖ్యఉద్దేశమన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం కొల్లిపరలో షేక్ కాజా ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, కంచర్ల అమృతరాజు, ఆళ్ల సురేష్‌రెడ్డి, బొమ్ము వెంకట్రామిరెడ్డి, ఎ.రాధాకృష్ణారెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, ఎ.వెంకటరెడ్డి, జొన్నల బసివిరెడ్డి, దాసరి నరసయ్య, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

● రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. పలు ప్రాంతాలలో హార్వెస్టర్‌తో వరి నూర్పిడి చేస్తున్న రైతులను కలిసి కొనుగోళ్ల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం రైతులతో కలిసి బుధవారం స్థానిక గాంధీ ఇర్విన్ పార్కులో రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ, గత ఏడాది 35 నుంచి 40 బస్తాల వరకు ధాన్యం దిగుబడి వచ్చిందని, ఈ ఏడాది దిగుబడి తగ్గిందన్నారు. ఇదే సమయంలో ధాన్యం బస్తా గత ఖరీఫ్‌లో రూ.1700 ఉంటే ప్రస్తుతం రూ.1400 మించడం లేదని చెప్పారు. దీనివల్ల రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం వెంటనే స్థానికంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి నష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు. యోగేశ్వరరావు, రవీంద్ర, శివకుమారి, రాజ్యలక్ష్మి, కిన్నెర, చంద్రకళ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులు ఐకమత్యంగా ఉండాలి

● పట్టణ తెలుగునాడు ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు మురళి

తెనాలి, మారీసుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులందరూ ఐకమత్యంగా ముందుకు నడుస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాకు చేర్చి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని తెనాలి పట్టణ తెలుగునాడు ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అన్నారు. బుధవారం మండల పరిధి అంగలకుదురులో ఆటోయూనియన్ నాయకులు గౌరవాధ్యక్షుడు వీరవల్లి మురళిని దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమానికి యూనియన్ తరుఫున అన్నివిధాల సహాయ సహకారాలను అందిస్తానన్నారు. కార్మికులు ఆటోలను నడిపే క్రమంలో ఆరోగ్య పరిరక్షణపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో వారికి తగిన గౌరవం ఇస్తూ సకాలంలో వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. తోటి కార్మికులతో సమస్యలు వస్తే అందరూ కలసికట్టుగా శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. యూనియన్ మాటున విభేదాలు వద్దని కుల, మత రాజకీయాలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఒకటేననే భావనతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆటో రాజు, సుభాని, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



వీరవల్లి మురళిని పుష్ప గుచ్ఛాలతో సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలపై దృష్టిపెట్టండి

● ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలి మారీసుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో నిలిచిపోయిన ఇంటి నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి పేదల సొంతింటి కలను నెరవేర్చేలా అధికారులు, సిబ్బంది కృషిచేయాలని ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని సంగంజాగర్లమూడి జగనన్న కాలనీలని హౌసింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థలాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణపనులకు ముందుకు వచ్చి అధికారులకు సహకరించాలన్నారు. కాంట్రాక్టర్లు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి నాణ్యతాప్రమాణలతో ఇంటి నిర్మాణాలు చేపట్టి నిర్ణీత సమయంలోపు పూర్తిచేసేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: సర్పంచ్ డాక్టర్ ప్రీతి

తెనాలి మారీసుపేట, తెనాలి క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొలకలూరు గ్రామ సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి అన్నారు. బాల్యవివాహ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొలకలూరు హైస్కూల్‌లో బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులు జి.ప్రగతి, ఎం. మల్లిక, స్కూల్ చైర్మన్ జిలాని, హెల్త్ సూపర్‌వైజర్ పి.భాగ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధక చట్టంపై పెదరావూరులో బుధవారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

● పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న, మండల తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి, మారీసుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న, మండల తహసీల్దార్ గోపాలకృష్ణలు అన్నారు. స్థానిక కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కాలేజీలో బుధవారం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఓటు హక్కు ఆవశ్యకతను మండల తహసీల్దార్ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శేషన్నలు వివరించారు.

● పెదకాకాని: ప్రజాస్వామ్య మనుగడకు ఓటు ఎంతో కీలకమని పెదకాకాని మండల తహసీల్దార్ కే కృష్ణకాంత్ బుధవారం అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఏర్పాటుచేసిన స్వీప్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు 17 సంవత్సరాలు నిండిన వారు కూడా కాబోయే ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భక్తసింగ్, పెదకాకాని ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రచయిత బొల్లిముంత 104వ జయంతి

తెనాలి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ సినీ రచయిత, ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు బొల్లిముంత శివరామకృష్ణ అని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర రమణరావు చెప్పారు. ఎన్జీవో కళ్యాణ మండపంలో బుధవారం బొల్లిముంత శివరామకృష్ణ 104వ జయంతి ఘనంగా నిర్వహించారు. పోస్టల్ యూనియన్ నాయకుడు బీవీ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయన రాసిన అందరూ బతకాలి నాటకాన్ని రక్తకన్నీరు నాగభూషణం 100 ప్రదర్శనలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజానాట్య మండలి కళాకారుడు నీలాంబరం, బెల్లంకొండ వెంకట్, అలపర్తి వెంకటేశ్వరరావు, కనపర్తి బెన్‌హర్, గరికపాటి సుబ్బారావు, బొల్లిముంత కృష్ణ, రంగిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సోమసుందరపాలెంలో పొలం పిలుస్తోంది

తెనాలి మారీసుపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని సోమసుందరపాలెంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న బీపీటీ-3082 వరి రకంను బాపట్ల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వి.కృష్ణవేణి, డాక్టర్ టి.హరితలు పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా సాగులో తీసుకున్న జాగ్రత్తలు పెట్టిన పెట్టుబడి వంటి పలు విషయాలను రైతులనుండి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ దోమపోటు, మెడ విరుగుడు వంటి తెగుళ్లను సైతం ఈ రకం విత్తనాలు తట్టుకుని రైతులకు పెట్టుబడులు తగ్గించాయన్నారు. వీరితోపాటు ఏవో ప్రేమసాగర్, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

శిథిలమవుతున్న పారిశుధ్య రిక్షాలు





పెదకాకాని గ్రామ పంచాయతీ ప్రధాన రిజర్వాయర్లు ఉన్న ప్రాంతంలో గత కొద్దికాలంగా పారిశుధ్యానికి వినియోగించే రిక్షాలు, బల్ల బండ్లు తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. తక్షణమే వాటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని పెదకాకాని ప్రజలు కోరుతున్నారు.

\- పెదకాకాని, ఆంధ్రజ్యోతి



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చక స్వాములు

భక్తి శ్రద్ధలతో ఊంజల్ సేవ

పొన్నూరు టౌన్, నవంబరు 27: మండల పరిధిలోని ములుకుదురులోని శ్రీ భూ నీలా సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పూజల అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలలో ములుకుదురు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● మండల వ్యవసాయ శాఖ అధికారి డేగల వెంకట రామయ్య



మినుము విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పొన్నూరు టౌన్, నవంబరు 27: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి డేగల వెంకట రామయ్య కోరారు. మండల పరిధిలోని ఉప్పరపాలెం సీతారామపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో ఏవో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏ గ్రేడ్ 75 కిలోల ధాన్యం బస్తాను రూ.1740కి, బీ గ్రేడ్ రూ.1725 ధరకు కొనుగోలు చేస్తునట్లు చెప్పారు. రైతులు 17శాతం తేమ ఉండేలా ధాన్యంను ఎండబెట్టాలని సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను రైతు సేవా కేంద్రాల ద్వారా నిర్వహిస్తునట్లు చెప్పారు. రబీలో ఎఫ్ఎంఎస్ పథకం ద్వారా ఉచిత మినుము విత్తనాల చిరుసంచులను పంపిణీ చేశారు. దాళ్వాకు పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవాలని, ప్రీమియం చెల్లించటానికి డిసెంబరు 15 ఆఖరు తేదీగా తెలిపారు. కార్యక్రమంలో రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సీతారామపురం సర్పంచ్ చుండు పద్మ, ఆయా గ్రామాల రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ యశోధరకు షారోన్ అవార్డు



డాక్టర్ యశోధర

తెనాలి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన డెర్మటాలజిస్టు డాక్టర్ పువ్వాడ యశోధరకు షారోన్ స్మారక అవార్డు ప్రకటించారు. స్వచ్ఛంద సేవా సంస్థ పెన్నీ మినిస్ట్రీస్ డైరెక్టర్ దోనేపూడి ప్రదీప్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, కెనడా దేశానికి చెందిన సంఘ సేవకురాలు షారోన్ పేరిట ప్రతి ఏటా ఒక ప్రముఖునికి అవార్డు ఇస్తున్నామన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఎస్.భవనంలో గురువారం జరిగే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేస్తామని తెలిపారు. యశోధర వైద్య శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ అందుకుని చర్మ రుగ్మతలపై పరిశోధనలు చేస్తూ, సంస్థ నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో సేవలు అందిస్తున్నారు.



సిబార్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ నరసింహ, డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ తదితరులు

సిబార్‌లో ముగిసిన వైట్ కోట్ వేడుకలు

● ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ

పెదకాకాని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదువుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ నరసింహ కోరారు. బుధవారం సిబార్ దంత వైద్య కళాశాలలో ఏడాది బీడీఎస్ ప్రథమ సంవత్సరం చేరిన విద్యార్థినీ, విద్యార్థులకు వైట్‌కోట్ (2024-25, బ్యాచ్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరసింహం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వైద్య విద్యార్థిగా ఎదురయ్యే అన్ని సవాళ్లను ఎదుర్కొని సమాజ సేవలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నూతనంగా చేరిన విద్యార్థులకు డాక్టర్ నరసింహం వైట్ కోట్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ వెంకటరమణారెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సాయిశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.